Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 214 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 ఆగష్టు 2023 గురువారం పేజీలు : 4

### మూడు రోజులు మూతపడనున్న ఢిల్లీ నగరం

న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరం ఢిల్లీ, నగర పాలక సంస్థ ప్రాంతాలు మూడు రోజులపాటు జన సంచారం లేక బోసిపోబోతున్నాయి. జీ20 నేతల సమావేశాల నేపథ్యంలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ప్రకటించబోతుం డటంతోపాటు రవాణా వ్యవస్థలపై కూడా ఆంక్షలు విధించబోతు న్నారు. వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో జరిగే ఈ సమావేశాల కో సం చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జీ20 దేశాధినేతల సమావేశాలు సజావుగా జరగడం కోసం కట్టుదిట్టమైన చర్యలను అమలు చేస్తున్నారు. దీంతో మాల్స్, మార్కెట్లు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల కార్యకలాపాలు ప్రభావితం కాబోతున్నాయి.

# అనతి కాలంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రం తెలంగాణ

## మెదక్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్







మెదక్: తెలంగాణ రాష్ట్రం అనతి కాలంలోనే అభివృద్ధి చెందినదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు అన్నారు. దాదాపు 60, 70 ఏండ్ల క్రితం ఏర్పాటైన ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో అభివృద్ధి గణనీయంగా జరిగిందని తెలిపారు. కేవలం తొమ్మిదిన్నర ఏండ్లలోనే రాష్ట్రంలో ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునే స్థాయికి ఎదిగిందని చెప్పారు. కొన్ని రాష్ట్రాల్లో సరైన అసెంబ్లీ, సెక్రెటేరియట్ కూడా లేవన్నారు. మనం 33 జిల్లాలను ఏర్పాటు చేసుకోవడమేగాక ఇప్పుడు 24వ కలెక్టరేట్‌ను కూడా ప్రారంభించుకోవడం తనకు చాలా సంతోషంగా ఉందని సీఎం చెప్పారు. నూతన కలెక్టరేట్‌ను, ఎస్పీ కార్యాలయాన్ని నిర్మించుకున్నందుకు మెదక్ జిల్లా ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. మెదక్ కలెక్టరేట్ ఆర్కిటిక్చర్ ఉషారెడ్డి మన తెలంగాణ బిడ్డేనని సీఎం కేసీఆర్ ఆమెకు అభినందనందించారు.

దేశంలో తెలంగాణ నెంబర్ వన్ రాష్ట్రంగా ఉన్నదని, స్వచ్ఛమైన నీటిని ఇంటింటికి అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని ముఖ్యమంత్రి చెప్పారు. అన్ని జిల్లాల్లో నిర్మించుకున్న ఈ పరిపాలనా భవనాలు చూస్తేనే మన రాష్ట్ర అభివృద్ధి గురించి తెలిసిపోతుందన్నారు. గతంలో చేతగాని పాలకుల వల్ల రాష్ట్రం వెనుకబడి పోయిందన్నారు.

ఇప్పుడు ఇంత అభివృద్ధి జరుగుతున్నా నాటి చేతగాని పాలకులు విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రూ.200 ఉన్న ఆసరా పింఛన్‌లను ఇప్పుడు రూ.4000 తీసుకొచ్చామని చెప్పారు.

**మెదక్ జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి కేసీఆర్ :** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మెదక్ జిల్లాలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయాన్ని (కలెక్టరేట్‌ను) ప్రారంభించారు. సీఎం కలెక్టరేట్ ప్రాంగణంలోకి చేరుకోగానే పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కార్యాలయం బయట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆ తర్వాత కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద సీఎస్ శాంతి కుమారి రిబ్బన్ కట్ చేశారు. కార్యాలయంలోపల ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. నేతలు, అధికారులతో కలిసి వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్‌ను కుర్చీలో కూర్చోబెట్టి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు తమ ఆశీర్వచనాలు అందించారు. అనంతరం సీఎం కేసీఆర్ కలెక్టర్‌కు శాలువా కప్పి సత్కరించారు. అంతకుముందు సీఎం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని, జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం వెంట మంత్రి హరీశ్‌రావు, హెూంమంత్రి మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి, డీజీపీ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

**మెదక్‌లో జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్ :** సీఎం కేసీఆర్ మెదక్ జిల్లాలో పర్యటిస్తున్నారు. కొద్దిసేపటి క్రితమే మెదక్ చేరుకున్న ఆయన ముందుగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన దేవుళ్ల చిత్రపటాల దగ్గర పూజ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు అక్షింతలు వేసి ఆయనను ఆశీర్వదించారు.

ఆ తర్వాత జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని కేసీఆర్ ప్రారంభించారు. సీఎం వెంట మంత్రి హరీశ్‌రావు, హెూంమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి, డీజీపీ అంజన్ కుమార్ యాదవ్, తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, మెదక్ జిల్లా నేతలు, తదితరులు ఉన్నారు.

# దొరల పాలనతో బహుజనులకు తీరని నష్టం




హైదరాబాద్: దొరల పాలనతో బహుజనులకు తీరని నష్టం జరుగుతోందని తెలంగాణ బహుజన సమాజ్ వాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం నాడు నర్సంపేటకు చెందిన మదన్ కుమార్ బీఆర్ఎస్ పార్టీ నుంచి బహుజన సమాజ్ వాజ్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.."బహుజన సమాజ్ వాదీ పార్టీ మరో విజయం సాధించింది. దొరల పార్టీ నుంచి, దొరల జెండా మోస్తూ చాకిరి చేసిన బహుజనుడు బహుజనుల పార్టీకి రావడం సంతోషం. ఒక శాతం ఉన్న అగ్రవర్ణాల అధికారాన్ని చేపడుతుంటే..90శాతం ఉన్న బహుజనులు ఏం చేయాలని ప్రశ్నించారు. బీసీ వర్గాల నుంచి 150కులాలు ఉంటే 6కులాలకే టికెట్లు ఇచ్చి..23సీట్లు మాత్రమే సీఎం కేసీఆర్ ఇచ్చారు. బహుజనులు మన బతుకుల బాగుకోసం మనం ఆలోచించాలి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మళ్లీ దొరల పాలన వల్ల బహుజనులు నష్టపోతున్నాం. 99శాతం ఉన్న మన కోసం మన పార్టీ బహుజన సమాజ్ పార్టీ సిద్ధంగా ఉంది.. మనం అందరం ఒక తాటిపైకి రావాలి. వంద కోట్ల లిక్కర్ స్కామ్‌లో నిందితురాలు అయిన ఎమ్మెల్సీ కవితు ముట్టుకోవడానికి భయపడుతున్నారు. అదే బహుజన గిరిజన బంజారా లక్ష్మి భాయ్‌ను చిత్రహింసలకు గురిచేస్తే ఎవరు మాట్లాడరు.డాక్టర్ తాటికొండ రాజయ్యకు టికెట్ రాకపోతే అంబేడ్కర్ విగ్రహం వద్ద వలవల ఎడుస్తున్నారు.. ఆయనకు అంబేడ్కర్ ఏం చెప్పిండో తెలియదా? అంబెడ్కర్.. ఆత్మ గౌరవంతో బోధించు, సమీకరించు, ఆశించు అని జీవించమన్నారు. రాజయ్యా.. మీరు అలా ఏడవద్దు. ఎలక్షన్ ఓట్ల కోసమే రైతు రుణ మాఫీ, లాంటి బిస్కెట్లు వేసి కేసీఆర్ ఆకట్టుకుంటున్నారూ. అది నమ్మకండి" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న బహుజనులారా బహుజన సమాజ్ వాజ్ పార్టీలోకి రండి అందరం ఏకం అవుదాం.. మా పార్టీ ఎప్పుడు మీకు స్వాగతం పలుకుతుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. "బీజేపీతో బీఆర్ఎస్ రహస్యంగా ఒప్పందం చేసుకున్నారు. ఒక్కో నియోజకవర్గానికి 50కోట్ల వరకు పెట్టడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. బహుజనులు ఓట్ల కోసం ఇతర పార్టీవాళ్లు ఇచ్చే తాయిలాలకు ఆశపడొద్దు. కేసీఆర్ ఇప్పటికే ఓడినట్లు ఒప్పుకొని రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. ఇంటిలిజెన్స్‌లను అడ్డుపెట్టుకొని సర్వేలు చేయిస్తున్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా మార్చిన కేసీఆర్‌ను మళ్లీ ఎన్నుకుంటే రాష్ట్రం ఆగం ఐతది. అగమేగలమీద లిక్కర్ టెండర్లు వేస్తున్నాడు. డిసెంబర్ వరకు సమయం ఉన్న ఇప్పుడే ఎందుకు వేలం వేస్తున్నారంటే .. ఆ డబ్బులు ఎలక్షన్స్ ఫండ్ కోసమే.

సిగ్గులేకుండా రిజర్వేషన్లపై సీట్లు పొందిన వారు వెంటనే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి రావాలి. లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ భూమి వేలం వేసుకొని డబ్బులు దన్నుకుంటున్నారు. విలేకరులపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. జర్నలిస్టులకు బహుజనుల సమాజ్ వాజ్ పార్టీ మద్దతుగా ఉంటుంది" అని బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.




హైదరాబాద్: పదేళ్లుగా పూర్తి మెజార్టీతో కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ సర్కార్ మహిళా బిల్లును ఎందుకు ఆమోదించలేదని భారాస ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఇప్పటికీ పార్లమెంట్‌లో మహిశా సభ్యులు కేవలం 12 శాతమేనని చెప్పారు. తొలి లోక్‌సభలో 8 శాతం మహిళా ఎంపీలు ఉంటే ఇప్పుడు 12శాతం మంది ఉన్నారన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. "మణిపుర్‌లో ఇప్పుడు ఇద్దరు మహిళలు మాత్రమే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మహిళలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగానే మిగిలిపోవాలా? 2010లో రాజ్యసభలో ఆమోదం పొందిన మహిళా బిల్లు 2023 వచ్చినా ఎందుకు ఆమోదం పొందలేదు" అని కవిత ప్రశ్నించారు.

# 'మామా వచ్చేశాం'

## జాబిల్లిపై అడుగుపెట్టిన చంద్రయాన్-3




బెంగళూరు: పున్నమి నిండు చందమామ సొగసు చూస్తూ వేల ఏళ్లుగా మురిసిపోయిన భారతావని మనసు.. ఇప్పుడు గర్వంతో ఉప్పొంగిపోతోంది. నెలరాజు గుట్టు విప్పేందుకు నింగిలోకి దూసుకెళ్లిన మన చంద్రయాన్-3 విజయగీతిక వినిపించింది. 140కోట్ల మంది భారతీయుల కలల్ని నిజం చేస్తూ జాబిల్లిపై అడుగు పెట్టింది. పదిహేనేళ్ల క్రితం చంద్రుడిపై నీరుందని తేల్చి విశ్వపరిశోధనల్లో కొత్త శ్వాస నింపిన భారత్.. ఇప్పుడు చంద్రయాన్-3తో జాబిల్లిపై ఎవరూ వెళ్లని దారుల్లో వెళ్లి.. ఎవరూ చూడని 'దక్షిణ' జాడల్ని ప్రపంచానికి చూపిం చింది. బుధవారం సా. 6.03 గంటలకు ల్యాండర్ జాబిల్లిపై దిగ్విజయంగా కాలుమోపి.. భారత వైజ్ఞానిక సత్తాను ప్రపంచానికి చాటిచెప్పింది.

**41 రోజుల ప్రయాణం..** నాలుగేళ్ల కిందట చివరి క్షణాల్లో చెదిరిన కలను ఎలాగైనా సాకారం చేసుకోవాలన్న పట్టుదలతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ జులై 14న చంద్రయాన్-3 ప్రయోగాన్ని చేపట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి దూసుకెళ్లిన బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం3-ఎం4 విజయవంతంగా భూకక్ష్యలోకి చేరింది. మరుసటిరోజు తొలిసారి దీని కక్ష్యను పెంచారు. ఇలా 18 రోజుల వ్యవధిలో దశలవారీగా అయిదుసార్లు కక్ష్యను పెంచారు. అయిదో భూకక్ష్య పూర్తయిన అనంతరం.. జాబిల్లి దిశగా ప్రయాణానికిగానూ ఆగస్టు 1న 'ట్రాన్స్ లూనార్ కక్ష్య'లోకి ప్రవేశపెట్టారు. అక్కడి నుంచి ఆగస్టు 5న విజయవంతంగా చంద్రుడి కక్ష్యలోకి చేర్చారు.

క్రమంగా కక్ష్యలను తగ్గిస్తూ చందమామకు చేరువ చేశారు. ఆ తర్వాత ఆగస్టు 17న ఈ వ్యోమనౌకలోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన 'ల్యాండర్ మాడ్యూల్' ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విజయవంతంగా విడిపోయిం ది. సొంతంగా చంద్రుడి కక్ష్యలో పరిభ్రమించింది. ఆ తర్వాత రెండు సార్లు డీ-ఆర్బిట్ ప్రక్రియలు చేపట్టి ల్యాండర్‌ను జాబిల్లి ఉపరితలానికి దగ్గర చేశారు.

**విక్రమ్ పరాక్రమ్..** అలా బుధవారం సాయంత్రం 5.44 గంటల ప్రాంతంలో ల్యాండర్ మాడ్యూల్.. ల్యాండింగ్‌ను నిర్దేశించిన ప్రాంతానికి చేరుకుంది. ఈ క్రమంలోనే ఇస్రో.. ల్యాండింగ్ మాడ్యూల్‌కు ఆటోమేటిక్ ల్యాండింగ్ సీక్వెన్స్ కమాండ్‌ను పంపించింది. ఈ కమాండ్‌ను అందుకున్న ల్యాండర్ మాడ్యూల్.. తన కృత్రిమ మేధ సాయంతో సాఫ్ట్ ల్యాండింగ్ మొదలుపెట్టింది. తన నాలుగు థ్రాటల్‌బుల్ ఇంజిన్లను ప్రజ్వలించి తన వేగాన్ని తగ్గించుకుంది. రఫ్ బ్రేకింగ్ దశను విజయవంతంగా ముగించుకుని జాబిల్లి ఉపరితలం నుంచి 7.4 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. ఆ తర్వాత ల్యాండర్ మాడ్యూల్ తన దిశను మార్చుకుంది. ల్యాండర్ పొజిషన్ డిటెక్షన్ కెమెరా (ఎల్‌పీడీసీ), కేఏ బ్యాండ్ అండ్ లేజర్ బేస్డ్ ఆల్టీమీటర్లు, లేజర్ డాప్లర్ వెలోసీమీటర్ వంటి సాధనాలతో గమ్యాన్ని నిర్దేశించుకుంది. ఆ తర్వాత దశలవారీగా నెమ్మదిగా జాబిల్లి ఉపరితలానికి కొన్ని మీటర్ల ఎత్తులోకి చేరింది. చివరిగా ల్యాండింగ్‌కు అనువైన ప్రదేశాన్ని ఎంచుకుని దిగ్విజయంగా చంద్రుడిపై కాలుమోపింది.

**తొలి దేశంగా సరికొత్త చరిత్ర..** జాబిల్లి దక్షిణ ధ్రువం..! అంతరిక్ష రంగంలో ప్రబల శక్తులుగా పేరున్న అమెరికా, రష్యా, చైనాలకు సైతం అందని ద్రాక్ష అది. అలాంటి కఠినమైన చోట వ్యోమనౌకను సురక్షితంగా దించి భారత్ సరికొత్త చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించింది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా అవతరించింది.

# సంపాదకీయం

## తల పట్టుకుంటున్న చైనా ప్రభుత్వం..!!

ప్రపంచానికి తరచూ ఏదో ఒక తలనొప్పిని తెచ్చి పెట్టే చైనాకు ఇప్పుడు కొత్త సమస్య ఎదురైంది. గడిచిన కొంతకాలంగా జననాల రేటు ఆ దేశంలో తగ్గిపోవటం తెలిసిందే. ఈ సమస్య నుంచి బయటపడేందుకు చైనా సర్కారు ప్రయత్నాలు చేస్తున్నా ఫలితాలు రాని పరిస్థితి. ఇదిలా ఉంటే.. ఇటీవల కాలంలో చైనీయుల్లో మరో కొత్త ధోరణి మొదలైంది. పెళ్లి చేసుకోవటంపై వారు అనాసక్తిని ప్రదర్శిస్తున్నారు. తాజాగా చైనా పౌర సంబంధాలు వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2021తో పోలిస్తే.. 2022లో పెళ్లి చేసుకునే వారి సంఖ్య 10.5 శాతం తగ్గినట్లుగా పేర్కొన్నారు. 2021లో 7.63 మిలియన్ల జంటలు వివాహం చేసుకుంటే.. 2022లో 6.8 మిలియన్ల జంటలు మాత్రమే పెళ్లిళ్లు చేసుకున్నట్లుగా గుర్తించారు. అంటే.. ఏడాది వ్యవధిలో దాదాపు ఐదు లక్షల జంటల పెళ్లిళ్లు తగ్గిపోవటం గమనార్హం. గడిచిన 45 ఏళ్ల వ్యవధిలో ఒక ఏడాదిలో అతి తక్కువ పెళ్లిళ్లు నమోదైన ఏడాది 2022గా వారు చెబుతున్నారు. దశాబ్దాల తరబడి ఒక్క సంతానం విధానాన్ని కఠినంగా అమలు చేసిన చైనా ప్రభుత్వం తీరుతో.. అక్కడి ప్రజలు ఒక సంతానం వైపే మొగ్గు చూపుతున్నారు. అయితే.. దేశంలో జననాల రేటు తగ్గిపోతున్న నేపథ్యంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న చైనా.. దిద్దుబాటు చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. ఓవైపు పిల్లల్ని కనే విషయంలో చైనీయులు అనాసక్తిని ప్రదర్శిస్తుంటే.. అది సరిపోదన్నట్లుగా ఇప్పుడు పెళ్లి చేసుకునే విషయంలోనూ వారు అనాసక్తిని ప్రదర్శిస్తున్నారు. దీంతో.. పిల్లల్ని కనేవారికి ప్రోత్సాహాలు అందిస్తామని ప్రకటనలు చేస్తున్నా.. చైనీయుల్లో మాత్రం మార్పు రావటం లేదంటున్నారు. ఎందుకిలా? కారణాలేమిటి? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతికితే.. ఇటీవల కాలంలో పెరిగిన జీవన వ్యయాలు.. ఆదాయ మార్గాలు తగ్గటంతో పాటు.. కరోనా కారణంగా లక్షలాది మంది యువత ఇళ్లకే పరిమితం కావటంతో.. పెళ్లి చేసుకునే వారి సంఖ్య భారీగా తగ్గినట్లు చెబుతున్నారు. తమను తాము పోషించుకునేందుకే తిప్పలు పడుతున్న వేళ.. పెళ్లి చేసుకుంటే వచ్చి పడే బాధ్యతల బరువును మోసేందుకు యువ చైనీయులు ఆసక్తి చూపటం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో జననాల రేటు పెంచటానికి.. వివాహాల మీద ఆసక్తిని పెంచేందుకు వీలుగా చైనా కొత్త ప్రాజెక్టుల్ని చేపట్టింది. దేశంలోని 20 నగరాల్లో పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించి.. కొత్తగా పెళ్లి చేసుకునే వారికి.. పిల్లల్ని కనేందుకు వీలుగా ప్రత్యేక సెలవులు ఇస్తున్నారు. అంతేకాదు.. దేశంలోని స్పెర్మ్ బ్యాంకుల్లో ఆరోగ్యవంతులైన పురుషులు.. కాలేజీ విద్యార్థులు తమ వీర్య కణాల్ని స్వచ్ఛందంగా ఇవ్వాలని కోరుతున్నట్లుగా చెబుతున్నారు. అయినా.. పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాకపోవటం.. చైనా సర్కారును కలవరపాటుకు గురి చేస్తోంది.

# లోపించిన భద్రత.. నిబంధనలకు పాతర



కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. ప్రధానంగా వరద కాల్వ నిర్మాణ పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతీది కన్సల్టెన్సీ, సంబంధిత ఏజెన్సీనే పర్యవేక్షణ చేస్తుందని అంటున్న నగరపాలిక ఇంజినీరింగ్ అధికారులు.. కనీసం ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన వారే కరవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు జరుగుతున్న చోట స్థానికులకు అవగాహన కల్పించకపోవడం, ప్రమాదాలు జరిగితే బాధ్యుల ఎవరనే విషయాన్ని గుర్తించడం లేదు. ఇదే తరహాలో తిరుమల్‌నగర్‌లో కార్మికులు వరద కాల్వ పనులు చేస్తుండగా 5 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఇంటి గోడ కూలి ఓ కార్మికుడు చనిపోవడం ఆ ప్రాంతవాసులను కలచి వేసింది. ఎలాంటి భద్రత చర్యలు తీసుకోవడంలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.

గణేశ్‌నగర్ బైపాసు, హనుమాన్‌నగర్‌లో ప్రధాన వరద కాల్వ నిర్మాణ పనులకు డిసెంబరు 26న ఎడాపెడా తవ్వడంతో ఓ అపార్టుమెంట్ దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు కుప్పకూలాయి. రాత్రిపూట కావడంతో అటు రాకపోకలు సాగించలేదు. లేదంటే భారీ ప్రమాదం జరిగేది.

కదులుతున్న పునాదులు..వరదకాల్వ నిర్మాణ పనులను స్మార్ట్‌సిటీలో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ పనులు ప్రారంభించిన సదరు ఏజెన్సీ పాత కాల్వల గుండా తవ్వడం ప్రారంభించారు. ఇంటి గోడలకు అనుకొని తవ్వుతుండటంతో పునాదులు కూడా కదులుతున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. లోతుగా తవ్వుతుండటంతో ఇంటి పునాదులు ఆ మేరకు ఎలా ఉంటాయని ప్రశ్నిస్తున్నారు. మట్టి కూలి ప్రమాదకరంగా మారుతున్నాయని ఆగ్రహిస్తున్నారు. తిరుమల్‌నగర్‌లో ఇదే పరిస్థితి ఉండగా గణేశ్‌నగర్ బైపాసు రోడ్డులో కూడా అలాగే తవ్వారు.

పనుల్లో జాప్యం

ఎడాపెడా తవ్వుతుండగా వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించడం లేదు. ఒకటెండ్రు చోట్ల త్వరతిగతిన చేస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో సాలక అల్లి వదిలేస్తున్నారు. రాకపోకలు సాగించడం కూడా గగనంగా మారుతోంది. ప్రస్తుతం తిరుమల్‌నగర్, గణేశ్‌నగర్ బైపాసు రహదారి, కట్టరాంపూర్ రోడ్డు, కోతిరాంపూర్ ప్రధాన రహదారి, రాజా థియేటర్ వైపు, పాసుపోర్టు కార్యాలయం వైపు రోడ్లు, డ్రైనేజీల పనులు సాగుతున్నాయి. గణేశ్‌నగర్ బైపాసు, తిరుమల్‌నగర్ చుట్టూ పనులు చేస్తుండగా రాకపోకలు సాగించే ప్రజలు నానావస్థలు పడుతున్నారు. ఈనెల 1న సాయంత్రం 5 గంటలకు తిరుమల్‌నగర్‌లో అంతర్గత ప్రధాన కాల్వ నిర్మాణ పనులు చేస్తుండగా ఇంటికి సంబంధించిన ప్రహరీ సాలక అల్లుతున్న కార్మికులపై పడింది. ఆ సమయంలో అక్కడ ముగ్గురు కార్మికులు ఉండగా ఇద్దరికి గాయాలు కాగా.. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనతో ఆ ప్రాంతంలో ఆందోళన నెలకొంది.

అప్రమత్తత ఏదీ? వరదకాల్వ నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో అటుగా రాకపోకలు సాగించేందుకు వీలుగా భద్రత చర్యలు తీసుకోవాలి.బారికెడ్లు, రెడ్ రిబ్బన్లు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉండగా అది కనిపించడం లేదు. ఆ వైపు పనులు జరుగుతున్నట్లుగా హెచ్చరిక బోర్డులు ఉండాలి. ఫ్లెక్సీలతో రాసి ఎక్కడో మూలన ప్రదర్శిస్తుండటంతో అవి ప్రజలకు స్పష్టంగా కనిపించడం లేదు.పని చేస్తున్న కార్మికులకు రక్షణ చర్యలు తీసుకోవాలి. తలకు కచ్చితంగా హెల్మెట్లు ధరించేలా పర్యవేక్షించడం లేదు. అనుకొని ఘటన జరిగితే వారి కుటుంబానికి నష్ట పరిహారం అందేలా బీమా సౌకర్యం ఉండాలి. ప్రతి ఒక కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి. పనులు చేస్తున్న ప్రాంతంలో కచ్చితంగా కంపెనీ తరపున అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలి.

ముందస్తుగానే భద్రతపై సూచిస్తున్నాం

స్మార్ట్‌సిటీ పనులు చేస్తున్న సమయంలో సంబంధిత ఏజెన్సీకి ముందస్తుగానే రక్షణ, భద్రత చర్యలు తీసుకునేలా ఎప్పటికప్పుడూ ఆదేశాలు ఇస్తున్నాం. పనులు జరుగుతున్న సమయంలో బోర్డులు ఉంటాయి. బిట్ల వారీగా పనులు చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. త్వరగా పూర్తి చేయిస్తాం.నాగ మల్లేశ్వరరావు, ఎస్ఈ, నగరపాలిక

# ఆర్టీసీ బస్టాండులో పార్కింగ్ బాదుడు



కరీంనగర్ : కరీంనగర్ బస్టాండ్‌లో నిత్యం వందలాది మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తమ వాహనాలను ప్రయాణ ప్రాంగణ ఆవరణలోని సైకిల్ స్టాండ్‌లో పార్కింగ్ చేస్తుంటారు. దీనిని ఆసరా చేసుకున్న స్టాండ్ నిర్వాహకులు ఇష్టారీతిలో ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రయాణికులను డ్రాపింగ్, పికప్ చేసుకోవడానికి వాహనాల్లో వచ్చిన వారు ఉచితంగా పార్కింగ్ చేసే అవకాశముంది. నిర్వాహకులు మాత్రం వారి నుంచీ రుసుం వసూలు చేస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో రెండు పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. సైకిల్‌స్టాండ్-1 నాలుగేళ్ల కాలపరిమితితో నెలకు రూ.2,64,100(జీఎస్టీ, నిర్వహణ ఛార్జీలు అదనం), సైకిల్ స్టాండ్-2కు నెలకు రూ.2,06,850 (జీఎస్టీ, నిర్వహణ ఛార్జీలు అదనం) గుత్తేదారులు ఆర్టీసీకి చెల్లిస్తున్నారు. వాహనానికి గంటకు ఎంత ఛార్జీ వసూలు చేయాలనేది టెండర్ సమయంలో నమోదు చేస్తారు. నిర్దేశించిన సమయాన్ని బట్టి వసూలు చేయాలి. కానీ వారు ఇష్టారాజ్యం వసూలు చేస్తున్నారు.

కనిపించని బోర్డు

పార్కింగ్ స్థలాల వద్ద నిర్దేశిత రుసుంల పట్టిక, సమయంతో కూడిన నామఫలకాలు ఏర్పాటు చేయలేదు. నిర్వాహకులు ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తున్నారు. వారు ఇచ్చే రసీదులో వాహనం దెబ్బతిన్నా, విలువైన వస్తువులు పోయినా సంబంధం లేదని ముద్రించడం గమనార్హం.

మనిషిని కాపలా పెట్టి మరీ..పార్కింగ్ ప్రదేశాలు కాకుండా బస్టాండ్ ఆవరణలో ఖాళీ ప్రదేశం ఉంది. ఎవరైన బంధువులను, కుటుంబ సభ్యులను పికప్, డ్రాపింగ్ చేయడానికి వచ్చిన వారి వాహనాలు ఇక్కడ ఉచితంగా పార్కింగ్ చేసుకోవచ్చు. అలా వచ్చి పది నిమిషాలు నిలిపిన కార్ల నుంచి కూడా రూ.100 వసూలు చేస్తున్నారు. ఓ గుత్తేదారు ఇక్కడ ప్రత్యేకంగా ఓ వ్యక్తిని పెట్టి పార్కింగ్ స్థలానికి వెళ్లాలని సూచిస్తున్నట్లు వాహనదారులు తెలిపారు. వారు చెప్పినట్లుగా వినకపోతే టైర్ల నుంచి గాలి, ప్లగ్‌లు తీస్తున్నారు.

కొందరు తమ వాహనాలను పార్కింగ్ స్థలంలో కాకుండా ఖాళీ ప్రదేశంలో ఉదయం పార్కింగ్ చేసి బస్సుల్లో వెళ్లి సాయంత్రం తీసుకెళుతున్నారని, నిబంధనల ప్రకారం అంత సమయం అక్కడ వాహనాలను నిలపరాదని అధికారులు అంటున్నారు.

ఉన్నతాధికారులు ఉన్నా...కరీంనగర్ బస్టాండ్ పర్యవేక్షణ అంతా కరీంనగర్-1 డిపో పరిధిలోకి వస్తుంది. దుకాణాలు, సైకిల్ స్టాండ్ ఇలా మొత్తం చూడాల్సిన బాధ్యత ఆ డిపో అధికారులది. వీరికి తోడు ఇక్కడే ఈడీ, ఆర్ఎం, డిప్యూటీ ఆర్ఎం కార్యాలయాలు కూడా ఉన్నాయి. అయినా దీనిని అడ్డుకోవడంలేదు.

అడిగినా పట్టించుకోవడం లేదు- లోపల్లి శ్రీనివాస్‌రావు, వాహనదారుడు

పార్కింగ్ స్థలంలో ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాను. గంటలోపు తిరిగి వచ్చి నా వాహనాన్ని తీసుకుంటే రూ.18 వసూలు చేశారు. గంటలోపు సమయానికి ఆరు (జీఎస్టీ కలుపుకొని) రూపాయలు తీసుకోవాలి కదా అని ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వడం లేదు. 4 గంటలు వాహనం పార్కింగ్ చేస్తే ఎంత తీసుకుంటారని ప్రశ్నిస్తే రూ.30 తీసుకుంటామని సమాధానం చెబుతున్నారు. ఇంత దర్జాగా వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం.

చర్యలు తీసుకుంటాం- ఎన్.చందర్‌రావు, డిప్యూటీ ఆర్ఎం

బస్టాండ్ పార్కింగ్ స్థలం కరీంనగర్-1 డిపో పరిధిలోకి వస్తుంది. గుత్తేదారులు నిబంధనల మేరకు నడుచుకోవాలి. వారికి కేటాయించిన స్థలంలో వారు పార్కింగ్ చేయాలి. ఖాళీ స్థలం ఎలాంటి రుసుం వసూలు చేయరాదు. అత్యధిక రుసుం వసూలు చేసినా, అదనపు స్థలం ఉపయోగించినా వారిపై చర్యలు తీసుకుంటాం. దీనిపై విచారణ జరిపి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం.

# బాల్యానికి అండ.. భవితకు భరోసా

కరీంనగర్ : ప్రాథమిక విద్య పౌరుల భవితకు పునాది. అది దృఢంగా ఉంటేనే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చు. కొందరు తల్లిదండ్రులు అవగాహన లేకనో, ఆర్థిక ఇబ్బందుల కారణంగానో బలపం పట్టాల్సిన పిల్లలతో పనులు చేయిస్తున్నారు. వారికి పనుల నుంచి విముక్తి ప్రసాదించేలా ప్రభుత్వం ఏటా జనవరిలో 'ఆపరేషన్ స్మైల్', జులైలో 'ఆపరేషన్ ముస్కాన్' పేరిట ప్రత్యేక తనిఖీలు చేపడుతోంది. ఎనిమిదేళ్లుగా చేపడుతున్న ప్రత్యేక తనిఖీలతో బాల కార్మికుల సంఖ్య క్రమేణా తగ్గుతూ వస్తోంది. బాల కార్మికులు లేని జిల్లాగా తయారు చేయాలని జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషికి ఫలితం కనిపిస్తోంది. ఈ ఏడాది జనవరిలో చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్‌లో పట్టుబడిన బాలల సంఖ్య గణనీయంగా తగ్గడమే ఇందుకు నిదర్శనం.

ప్రత్యేక తనిఖీలు..

జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ (బాలల రక్షణ పథకం), పోలీస్, కార్మిక శాఖ, స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా తనిఖీ చేపడుతున్నారు. ఏటా జనవరి, జులైలో రెండు నెలలపాటు ఈ తనిఖీలు కొనసాగుతాయి. ముఖ్యంగా బాల కార్మికులు, అక్రమ రవాణా, తప్పిపోయిన చిన్నారులు, అనాథలు, భిక్షాటన చేస్తున్న చిన్నారులను గుర్తించి వారికి విముక్తి కల్పిస్తున్నారు. బాల్యంలోనే ఇటుక బట్టీలు, తదితర పని ప్రదేశాల్లో ఉండే చిన్నారులను గుర్తించి.. వారిని సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తున్నారు. కేంద్రాలు సమీపంలో లేని వారికి పౌష్టికాహారం పని ప్రదేశాల్లోనే అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. పని ప్రదేశాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలకు సైతం పోషకాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్..

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పని చేస్తున్న పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనిలో పెట్టుకున్న యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, హెచ్చరిస్తున్నారు. పాఠశాల విద్య మధ్యలోనే మానేసి పని ప్రదేశాల్లో కనిపించిన బాలలను తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేని మూలంగా పాఠశాలకు వెళ్లలేని వారిని ప్రభుత్వ వసతిగృహాల్లో చేర్పిస్తున్నారు. భిక్షాటన చేస్తున్న పిల్లలను సైతం గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గత ఎనిమిదేళ్లలో ఇప్పటి వరకు 3364 పిల్లలను గుర్తించారు. వీరిలో బాలురు 2509, బాలికలు 855 మంది ఉన్నారు.

బాలకార్మికులు లేని జిల్లానే లక్ష్యం

సబితకుమారి, జిల్లా సంక్షేమ అధికారి

ఏటా రెండు నెలలపాటు కొనసాగిస్తున్న ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ తనిఖీలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గతంలో పెద్ద సంఖ్యలో బాల కార్మికులు పట్టుబడే వారు, ప్రస్తుతం ఆ సంఖ్య చాలా శాతం తగ్గింది. పట్టుబడ్డ పిల్లలందరికీ ప్రత్యామ్నాయం చూపి వారిని అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేర్పిస్తున్నాం. బాల కార్మికుల రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నాం.

# రోడ్లపైనే వ్యాపారం

మెట్‌పల్లి : చిరు వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ రోడ్లపైన, కూడళ్లలో వ్యాపారాలు నిర్వహించకుండా వీధి వ్యాపారులకు దుకాణాల సముదాయాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పట్టణ ప్రగతి నిధులతో దుకాణాల సముదాయాలను నిర్మించి వ్యాపారులకు కేటాయించినా వ్యాపారం సరిగా నడవదని ఆసక్తి చూపడంలేదు. జగిత్యాల పురపాలక సంఘంలో షెడ్లు నిర్మించినా వ్యాపారుల గుర్తింపునకు సర్వే కొనసాగుతుండగా కోరుట్ల, మెట్పల్లి పురపాలికల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన దుకాణాల సముదాయులు వ్యాపారులు ఆసక్తి చూపకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. రోడ్లపైనే వ్యాపారం కొనసాగిస్తుండడంతో పాదచారులు, వాహనచోదకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

జోన్ల ఏర్పాటు కాగితాలకే పరిమితం

పురపాలికల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం దుకాణాల సముదయాలను నిర్మించడంతోపాటు వ్యాపారాలకు జోన్ల పద్ధతిని అమల్లోకి తీసుకొచ్చింది. మెప్మా ఆధ్వర్యంలో పురపాలికల్లో సీసీలు, ఆర్పీలు సర్వే నిర్వహించి వీధి వ్యాపారులను గుర్తించి మూడు రకాల జోన్లు ఏర్పాటు చేశారు. పురపాలికల్లో జోన్ల విధానం ఎక్కడా అమలు కావడంలేదు. జోన్ల ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది.

గ్రీన్‌జోన్: ఎలాంటి ట్రాఫిక్ అతరాయం కలగని ప్రదేశాలు, జనం రద్దీలేని ప్రాంతాలను గ్రీన్ జోన్లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగించడానికి అనుమతి ఇస్తారు.

ఆరెంజ్‌జోన్: ఓ మోస్తరు నుంచి మధ్యస్తంగా జనం రద్దీ ఉంటూ వాహనాల రాకపోకలు సాగించే ప్రధాన అంతర్గత రహదారులు, కూడళ్లను ఆరెంజ్ జోన్‌గా గుర్తించి ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు రెండు పర్యాయాలు వ్యాపారం నిర్వహించుకోవచ్చు.

రెడ్‌జోన్: ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, సినిమా హాళ్లు ప్రధాన కూడళ్లు ఉండే ప్రాతాలను రెడ్ జోన్లుగా పరిగణిస్తారు. ఈ ప్రాంతాల్లో ఎలాంటి వీధి వ్యాపారాలు నిర్వహించడానికి అనమతి ఇవ్వరు.

పట్టణంలోని ప్రభుత్వ గోదాములకు వెళ్లే దారి పక్కన పట్టణ ప్రగతిలో రూ.5 లక్షలు వెచ్చించి వీధి వ్యాపారుల కోసం దుకాణాల సముదాయాన్ని నిర్మించి 25 షెడ్లు ఏర్పాటు చేశారు. అద్దె నిర్ణయించి చిరు వ్యాపారులకు కేటాయించారు. అక్కడ కొనే వారుండరని దుకాణం ఏర్పాటు చేసుకుంటే నష్టాలు వస్తాయని ఆసక్తి చూపడంలేదని ఓ వ్యాపారి తెలిపారు.

ఇది కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్డులో రూ.15 లక్షలతో వీధి వ్యాపారులకు నిర్మించిన దుకాణ సముదాయం. 12 షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపారులకు కేటాయించారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం ఓ షెడ్డులో ఓ వ్యాపారి పండ్ల దుకాణం నిర్వహిస్తున్నారు. మిగతా షెడ్లన్నీ నిరుపయోగంగా ఉన్నాయి.

అవగాహన కల్పిస్తాంసునీత, మెప్మా డీఎంసీ, జగిత్యాల

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి పురపాలక సంఘాల్లో వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక దుకాణాల సముదాయం ఏర్పాటు చేశాం. జగిత్యాలలో వ్యాపారుల గుర్తింపుకు సర్వే జరుగుతోంది. మెట్పల్లి, కోరుట్లలో వ్యాపారులకు కేటాయించినా నిర్వహణకు ముందుకు రావడంలేదు. వారికి అవగాహన కల్పిస్తాం. దుకాణాల సముదాయాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం.

# బియ్యం నిల్వకు స్థలం అన్వేషణ

జనగామ : బియ్యం నిల్వ కోసం భారత ఆహార సంస్థ వెతుకులాట ప్రారంభించింది. 2022లో వరి దిగుబడి ఎక్కువ మొత్తంలో రావడంతో మిల్లర్ల వద్ద గుట్టలుగా ధాన్యం నిల్వలు పేరుకుపోయ్యాయి. బియ్యాన్ని ఓపెన్ టెండర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి పెడుతుండటంతో ఎఫ్‌సీఐ చర్యలకు ఉపక్రమించింది. ఒకేసారి మిల్లర్ల నుంచి బియ్యం గోదాములకు వస్తే ఎక్కడ నిల్వ చేయాలనే ఆలోచనతో ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటుంది. ప్రస్తుతమున్న నిల్వలను రైలు ద్వారా ఇతర రాష్ట్రాలకు సాధ్యమైనంత పంపించాలని భావిస్తోంది. మిల్లర్ల నుంచే వచ్చే వాటిని నిల్వ చేయాలని అనుకుంటుంది. అయినా సకాలంలో రైళ్లు రాకపోతే ఏం చేయాలనే ఆలోచనతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రైవేటు గోదాముల్లో స్థలాన్ని అద్దెకు తీసుకోవడానికి అడుగులు వేస్తుంది.

37,700 ఎంటీఎస్ మాత్రమే ఖాళీ

రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీలతో రైతుల వద్ద ధాన్యం సేకరించి మిల్లర్లకు అప్పగిస్తుంది. మిల్లర్లు వడ్లను మరాడించి బియ్యంగా మార్చి.. ఎఫ్‌సీఐకి అప్పగిస్తారు. దీనిని కస్టమ్ మిల్లింగ్‌గా పేర్కొంటారు. ప్రస్తుతం మిల్లర్ల వద్ద ఉన్న బియ్యం ఎఫ్‌సీఐకి చేరలేదు. పైగా గతేడాదికి సంబంధించి రెండో పంట కూడా రావాల్సి ఉంది. ఎఫ్‌సీఐ నిల్వ చేయడానికి ఖాళీ స్థలం ఎక్కువగా పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవల ఎఫ్‌సీఐ బియ్యం సేకరణలో ప్రమాణాలు కఠినంగా అమలు పరచడంతో చాలా మంది మిల్లర్లు బియ్యం పంపడానికి వెనకాముందు ఆడారు. దీంతో నిల్వ ఉన్న వాటిని ఎఫ్‌సీఐ ఇతర రాష్ట్రాలకు అనుకున్నంత పంపలేక పోయింది. కాజీపేట ఎఫ్‌సీఐ గోదాముల్లో 1.10 లక్షల మెట్రిక్ టన్నుల సరకు నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం 20,000 మెట్రిక్ టన్నులకు సరిపడా స్థలం మాత్రమే ఖాళీగా ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.46 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉంటే.. అందులో 37,700



ఎంటీఎస్ మాత్రమే ఖాళీగా ఉంది. ఆరు జిల్లాలే కాకుండా సిద్దిపేటను కాజీపేట ఎఫ్‌సీఐ పరిధిలోకి తెచ్చారు. వీటి నుంచి సుమారు 3 నుంచి 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా. ఇందులో సగం ఎఫ్‌సీఐకి బియ్యం రూపంలో వచ్చినా స్థలం కల్పించలేక పోతే ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

పాతవి పరిశీలన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న గోదాములు సరిపోకపోతే ఇతర గోదాములను కూడా పరిశీలిస్తున్నారు. రఘునాథపల్లి వద్ద ఉన్న గోదాములు తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం లేదని తిరస్కరించారు. ధర్మారం, జనగామ, సీబ్ల్యూసీ ఎనుమాముల గోదాములను పరిశీలిస్తున్నారు. సెప్టెంబరులో 20 రైళ్ల ద్వారా బియ్యం నిల్వలు పంపించి.. కాజీపేటలో స్థలం ఖాళీ చేసి అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.

# రోగ నిర్ధారణ పరీక్షలకు నిపుణుల కొరత

ములుగు : రాష్ట్ర ప్రభుత్వ జిల్లా కేంద్రాలలోని జిల్లా ఆసుపత్రులతో పాటు 50 పడకలతో కూడిన సామాజిక ఆసుపత్రులలో వివిధ రకాల వ్యాదుల నిర్ధారణకు హబ్‌లను ఏర్పాటు చేసినప్పటికీ అవి అలంకార ప్రాయంగా మారుతున్నాయి. హబ్‌లలోని సాంకేతిక సహాయకుల సహాయంతో నిర్వహించిన పరీక్షలను నిర్ధారిస్తూ వ్యాధుల నివేదికలు ఇచ్చే నిపుణులు లేక రూ.కోట్ల విలువ చేసే యంత్ర పరికరాలు నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో రోగులు ఇబ్బంధులు పడుతున్నారు.

నిరుపయోగంగా యంత్ర పరికరాలు ములుగులో నూతనంగా రేడియాలజీ హబ్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవలే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు వర్చువల్ పద్ధతిలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రేడియాలజీ హబ్‌లతో పాటు ములుగు హబ్‌ను కూడా ప్రారంభించారు. అయితే అందులో రేడియాలజిస్టులను నియమించలేదు. దీంతో విలువైన యంత్ర పరికరాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. హబ్‌లో 2డీ ఎకో యంత్రం ఉంది. దీని ద్వారా గుండె జబ్బుల నిర్ధారణ చేసుకునే అవకాశం ఉంది. మామోగ్రాఫ్ యంత్రం ద్వారా రొమ్ముకు సంబంధించి వ్యాధులను నిర్ధారిస్తారు. జిల్లా ఆసుపత్రిలో సీటీ స్కాన్ యంత్రం కూడా అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ యంత్రాలు నామమాత్రంగానే మారిపోయాయి. డిజిటల్ ఎక్స్‌రే మినహా ఏ యంత్రం ఉపయోగించేందుకు నిపుణులు లేరు.

57 రకాల టెస్టులకే పరిమితంజిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రెండు హబ్‌లను ఏర్పాటు చేసింది. ఇందులో తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్, రేడియాలజీ హబ్ ఉన్నాయి. తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌లో గతంలో 57 రకాల రక్త పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం 134 పరీక్షలు చేసే స్థాయికి పెంచారు. అయితే మైక్రో బయాలజిస్టులు లేక హబ్‌లో కేవలం గతంలో నిర్వహించినట్లుగానే 57 రకాల రక్త పరీక్షలకే పరిమితం కావాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినట్లుగా 134 రకాల పరీక్షలు రోగులకు అందుబాటులోకి రాలేదు. కేవలం పాథాలజీ నిపుణుడు నిర్ధారించే పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.నియామకానికి ప్రయత్నిస్తున్నాం.. డాక్టర్ జగదీశ్వర్, సూపరింటెండెంట్ జిల్లా ఆసుపత్రిములుగులోని రేడియాలజీ హబ్, తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌లో రేడియాలజిస్టు, మైక్రో బయాలజిస్టుల నియామకం కోసం ప్రయత్నాలు చేస్తున్నాం.

# కరవు నేలపై పెరిగిన వరి సాగు



జనగామ : జనగామ ప్రాంతం.. ఒకప్పుడు వర్షాభావ పరిస్థితులు.. అతివృష్టి, అనావృష్టి, కరవు కాటకాలతో తల్లడిల్లిన ప్రాంతం. నేడు పచ్చని పంటలతో సస్యశ్యామలంగా మారింది. గతంలో సాగునీరు లేక పంటలు ఎండిపోయి నష్టాల పాలైన రైతన్నలు.. ఇప్పుడు జల సిరులతో పంటలకు పుష్కలంగా నీరందుతుండడంతో ఆనందం వ్యక్తం చేసున్నారు. గతంలో ఆరుతడి పంటల సాగుకు నానా కష్టాలు పడ్డ రైతులు.. ప్రస్తుతం అధిక విస్తీర్ణంలో వరి, పత్తి తదితర పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సాగునీటి లభ్యత, మారిన వాతావరణ పరిస్థితులు, పెరిగిన సాగు విస్తీర్ణంపై కథనం.

సుమారు 2 లక్షల ఎకరాల్లో..

జనగామ ప్రాంతంలో సుమారు 2 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయనున్నారు. గతంలో సుమారు 2 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేయగా.. నీటి వనరుల లభ్యత కారణంగా పత్తి సాగు తగ్గుతూ.. వరి సాగు పెరుగుతూ వస్తోంది. జనగామ ప్రాంతంలో 2010 నుంచి 2016 వరకు సుమారు 60 వేల ఎకరాల్లో వరి సాగయ్యేది. 2017 నుంచి గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురవడం, గోదావరి జలాల రాక, నిరంతర విద్యుత్తు సరఫరాతో వరి సాగుకు వనరులు సమకూరాయి. 2017లో 70 వేలు, 2018లో 80–90 వేలు, 2019లో లక్ష ఎకరాలు, 2020లో 1.20 లక్షలు, 2021లో 1.50 లక్షలు, 2022లో 2.10 లక్షలు, ఈ ఏడాది 2 లక్షల ఎకరాల వరకు సాగయ్యే అవకాశముంది. ఈ నెలాఖరు వరకు వరినాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం మరింత పెరగనుంది.

కారణాలు ఇలా..

వర్షాలు సమృద్ధిగా కురవడం, గోదావరి జలాలతో జలాశయాలు, చెరువులు, వాగులు, కుంటలు నీటితో కళ కళలాడుతున్నాయి. ఆరుతడి పంటలు, పత్తి, ఇతర వాణిజ్య పంటల సాగుకు పెరిగిన పెట్టుబడులు, కూలీల రేట్ల పెంపుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు కోతుల బెడదతో రైతులు.. ఆరుతడి, వాణిజ్య పంటల సాగుకు అడుగు వేయలేకపోతున్నారు. వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. శాశ్వత వ్యవసాయ భూమిగా మార్చుకునేందుకు చెల్కలు, బీడు, గుట్టల భూములను సైతం పొలాలుగా చదును చేసుకుంటున్నారు. భూములను వరి సాగుకు అనుకూలంగా మార్చుకోవడం ద్వారా భవిష్యత్తులో అన్ని రకాల పంటలకు అనువుగా మారుతుండటం ఓ ప్రధాన కారణం. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా వరి సాగు విస్తీర్ణం పెరిగింది.

ఈ నెలాఖరు వరకు..వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది వానాకాలంలో 1.90 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేశాం. ఇప్పటి వరకు 1.28 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి కాగా.. ఈ నెలాఖరు వరకు అంచనా మేరకు వరి సాగు విస్తీర్ణం పెరగనుంది. పత్తి, కంది పంటలు అంచనా కంటే తక్కువగానే సాగయ్యాయి. నీటి వసతి పెరగడం, ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతో రైతులు వరి సాగుపై మక్కువ చూపుతున్నారు.

# ఆదాయం పెంపు లక్ష్యంగా సంపద వనాలు



జనగామ : పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం పథకంలో మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సంపద వనాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నీటిపారుదల ప్రాజెక్టులు, జలాశయాలు, చెరువులు, కుంటలు, ప్రధాన, ఉప కాల్వల పరిధిలో సంపద వనాలను ఏర్పాటు చేయనున్నారు. స్థలాల గుర్తింపునకు చర్యలుహరితహారం కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఊరూరా నర్సరీలు, పల్లెల్లో ప్రకృతివనాలు, మండలానికో బృహత్ ప్రకృతివనం, మినీ బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. మొక్కలను ఎలా నాటాలో ప్రత్యేక పద్ధతులు నిర్దేశించారు. ఈ క్రమంలోనే సంపద వనాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో దేవాదుల పథకంలో నిర్మించిన జలాశయాలున్నాయి. చీటకోడూరు, బొమ్మకూరు, గండిరామవరం, వెల్దండ, అశ్వరావుపల్లి, నవాబుపేట, ఆర్ఎస్ ఘన్‌పూర్, మైలారం బాలెన్సింగ్ రిజర్వాయర్లున్నాయి. వీటికి సంబంధించిన ప్రధాన కాల్వలు, ఉపకాల్వల పరిధిలో స్థలాలున్నాయి. కాల్వల పొడవునా మొక్కలు నాటేందుకు అవకాశం ఉందంటున్నారు. ఎస్సారెస్పీ కాల్వలతో పాటు, పెద్ద చెరువుల శిఖం భూముల్లోనూ, నీటిపారుదల శాఖ క్వార్టర్లు, కార్యాలయాల సముదాయం మిగులు స్థలాల్లోనూ సంపద వనాలను ఏర్పాటు చేయనున్నారు. వనాల ఏర్పాటు కోసం అర ఎకరం నుంచి 20 ఎకరాల వరకు స్థలాన్ని నీటి పారుదలశాఖ గుర్తించాల్సి ఉంటుంది. విధి విధానాలు, అమలు బాధ్యతలను జాతీయ గ్రామీణ ఉపాధిహామీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ ఇంజినీరింగు, అటవీశాఖలకు అప్పగించారు. గుంతలు తీయడం, మొక్కలు నాటే పనులను ఉపాధిహామీ పథకంలో చేపడతారు. గుర్తించిన స్థలం చుట్టూ కంచె ఏర్పాటు తదితర పనులను పంచాయతీరాజ్ విభాగం పర్యవేక్షిస్తోంది.

జిల్లాలో పది ప్రాంతాల్లో..

జిల్లా పరిధిలో తొలిదశలో నీటిపారుదల శాఖకు సంబంధించిన అర ఎకరం నుంచి 4 ఎకరాల విస్తీర్ణం కలిగిన 10 ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటారు. చుట్టూ కంచెతో పాటు, దశాబ్ది సంపద వనాలు పేరిట బోర్డులను ఏర్పాటు చేశారు. జనగామలోని నీటిపారుదలశాఖ క్వార్టర్ల ఆవరణ, నవాబ్‌పేట బ్యాక్ వాటర్ ఉండే కుందారం శివారు, బొమ్మకూరు, గండిరామవరం పంప్‌హౌస్, జలాశయం గట్టున, వెల్దండ, బమ్మెర రిజర్వాయర్ల ఒడ్డున, అశ్వరావుపల్లి రిజర్వాయర్, ఆర్ఎస్‌ఘన్‌పూర్ పంప్‌హౌస్, చీటకోడూరు రిజర్వాయర్ ఒడ్డున, మొత్తం 13.95 ఎకరాల్లో ఏడు వేల మొక్కలు నాటారు. పంచాయతీలకు అదనపు ఆదాయాన్నిచ్చేలా మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఈ వనాల్లో కలప జాతికి చెందిన టేకు, వేప, వెదురు, రోజ్‌వుడ్, పండ్లజాతికి చెందిన జామ, సీమ చింత, ఉసిరి, మామిడి, సీతాఫలం, వెలగ, మేడి తదితర మొక్కలను నాటాల్సి ఉంది. సంపదవనాలను హరితహారం నాణ్యతా విభాగం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి తగిన సూచనలు, సలహాలిస్తారు. ఇటీవల నాణ్యత నియంత్రణ అధికారులు చీటకోడూరు తదితర ప్రాంతాల్లోని వనాలను తనిఖీ చేశారు.

ప్రాథమిక దశలో ఉంది జి.రాంరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా.. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లాలో సంపద వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. నీటి పారుదలశాఖకు సంబంధించిన స్థలాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం ప్రాథమిక దశలో ఉంది. నాటిన మొక్కల స్థితి గతులను పరిశీలించి, అవసరమైన చోట కొత్త మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వనాల పరిరక్షణకు చుట్టు పక్కల రైతులు, అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరం.

# ఉద్యాన కళాశాల ప్రవేశాలపై ఉత్కంఠ

మానుకోట: జిల్లాలోని మల్యాలలో మంజూరైన ఉద్యాన కళాశాలలో ఈ విద్యా సంవత్సర ప్రవేశాలపై ఉత్కంఠ నెలకొంది. కొద్ది రోజుల క్రితమే శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) అనుబంధంగా మల్యాలలో ఉద్యాన కళాశాలకు ప్రభుత్వం అనుమతించింది. ఈ విద్యా సంవత్సరంలోనే తరగతులను నిర్వహించాలని తలపెట్టింది. తొలి సంవత్సరం బీఎస్సీ హానర్స్, ఉద్యాన విద్యలో 60 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారని భావిస్తున్నారు. బీఎస్సీ హానర్స్ ప్రథమ సంవత్సర ప్రవేశాలు టీఎస్‌ఎంసెట్ ద్వారా జరుగుతాయి. ఈ విద్యా సంవత్సర ఎంసెట్ నిర్వహణ పూర్తయింది. ప్రవేశాల కోసం ఎంసెట్ అర్హులయిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితానూ సిద్ధం చేశారు. వచ్చే నెల మొదటి వారంలో ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల కానుందని భావిస్తున్నారు. ఈ కౌన్సెలింగ్‌లోనే ఈ కళాశాలలోని సీట్లను కూడా భర్తీ చేస్తారని ఆశిస్తున్నారు.

తరగతుల నిర్వహణ ఎక్కడ?ప్రథమ సంవత్సర తరగతులను ఎక్కడ నిర్వహిస్తారనేది ఇంకా నిర్ణయించలేదు. మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానంలోనే తరగతులను నిర్వహించేలా పూర్తిస్థాయిలో భవన వసతి అంతగా లేదు. సాధారణంగా ఉద్యాన విభాగ విద్యార్థులకు ఉదయం వేళ ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. వీటిని మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్ఎస్ పరిధిలో తోటలు, ఉద్యాన వనాల్లో నిర్వహించవచ్చు. థియరీ తరగతుల నిర్వహణకు మాత్రం విద్యార్థుల సంఖ్యకు సరిపడా విశాల భవనం అవసరం. అందువల్ల జిల్లా కేంద్రంలోనే తాత్కాలికంగా అద్దె భవనంలో నిర్వహించే అవకాశం ఉంది. ఈ మేరకు భవనం కోసం అన్వేషణ తప్పదు.

# అసైన్డ్ భూముల్లో పాగా!

జయశంకర్ : భూముల ధరలు అమాంతం పెరిగాయి.. సామాన్యుడు ఓ గుంట భూమి కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది .. అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల క్రయవిక్రయాలు జరుపుతున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి పక్కన అటవీ భూమి ఉండగా.. మరోవైపు అసైన్డ్ భూమి ఎకరానికి రూ.కోటికి పైగానే ధర పలుకుతోంది. దీంతో స్థిరాస్తి వ్యాపారులు కొందరు ఆ భూములను కొనుగోలు చేసి ప్లాట్లు ఏర్పాటు చేసి, అమ్మకాలు సాగిస్తున్నారు.

సొంత భూమి పక్కనే ఉంటే..

కొందరు వ్యక్తులు తమ పట్టా భూమి పక్కన ఉండే అసైన్డ్ భూములను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తమ పట్టా భూమిలో కలుపుకుంటే భవిష్యత్తులో విక్రయించినా.. ఆ ప్రాంతంలో సింగరేణి, జెన్‌కో సంస్థలు ఏదైనా అవసరం నిమిత్తం తీసుకుంటే పెద్ద ఇబ్బంది ఉండదని భావిస్తూ కొందరు కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో అసైన్డ్ లబ్ధిదారుల నుంచి బాండ్ పేపర్ మీద లేదంటే నోటరీ ద్వారా రాయిం



చుకుంటున్నారు. ఈ భూముల వైపు తాము రామని అసైన్డ్‌దారుల నుంచి ఒప్పందం చేసుకుంటున్నారు. ప్రస్తుతం తక్కువ ధరకు తీసుకోవడంతో ముందుందు ప్రయోజనం ఉంటుందని ఆశిస్తున్నారు. ప్రభుత్వం ఒక వేళ పొజిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్(పీవోటీ) చేస్తే తమ పేర్ల మీద అవుతాయని కొనుగోలుదారులు భావిస్తున్నారు. భూపాలపల్లి మండలంలోనే మొత్తం 14,991 ఎకరాల అసైన్డ్ భూములుంటే ఇందులో 5,576 ఎకరాల భూములు విక్రయాలు జరిగినట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా తెలిసింది.

అన్యాక్రాంతమవుతూ.. కేటీకే 5వ గని ప్రధాన రహదారి పక్కన 170 సర్వే నంబరులో 8.02 ఎకరాల వరకు అసైన్డ్ భూములు ఉండగా, దాదాపు రెండు దశబ్దాల క్రితం 12 మంది లబ్ధిదారులకు వ్యవసాయ యోగ్యానికి అసైన్డ్ పట్టాలు జారీ చేశారు. అప్పట్లో ఈ భూములు సాగుకు అనుకూలంగా లేకపోవడంతో కొన్నేళ్లపాటు ఖాళీగా ఉంచుకున్నారు. ఈ భూములు కూడా కొందరు అక్రమంగా కబ్జా చేసుకుని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. పట్టణానికి అతి సమీపంలో ఉన్నందున భూములకు డిమాండ్ పెరిగింది.

జిల్లా కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయం పక్కన జాతీయ రహదారి పక్కన 218, 219 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ సీలింగ్ భూముల్లో కొందరు ఆరేళ్ల క్రితమే నిర్మాణాలు ఏర్పాటు చేసుకున్నారు.. గతంలో అధికారులు వాటిని తొలగించడానికి యత్నించారు. సుమారు 10 గుంటల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది.

జిల్లా కేంద్రానికి ఆనుకొని గణపురం మండలం చెల్పూరు శివారులోని సర్వే నంబరు 91లో ప్రభుత్వ సర్కారు భూములున్నాయి. ఇందులో ఓ వ్యక్తి ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా పొంది దర్జాగా గుంటల చొప్పున విక్రయిస్తున్నారు. అలాగే, దానిలో కొంత భూమిని ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారు. అసైన్డ్, ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలే జరపవద్దనే నిబంధనలున్నా ఏకంగా ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారు. భూపాలపల్లి పట్టణంలో జాతీయ రహదారి పక్కన 141 సర్వే నంబరులో 48.29 ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. సుమారు రెండున్నర దశబ్దాల క్రితం ఎస్టీ, ఎస్సీ, బీసీలకు సుమారు 20 ఎకరాల వరకు 42 మంది లబ్ధిదారులకు అసైన్డ్ పట్టాలిచ్చారు. మిగతా భూమి ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం కలెక్టరేట్ భవన సముదాయం, అదే ప్రాంతంలో వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి కేటాయించారు. గతంలో ఇచ్చిన అసైన్డ్ పట్టాదారులు ఎవరూ ఆ భూముల్లో కాస్తులో లేకపోవడంతో ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలోనే 2.20 ఎకరాల అసైన్డ్ భూమిని అక్రమంగా కొందరు తప్పుడు కాగితాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు తెలిసింది. భూమి విలువ సుమారు రూ.2 కోట్లకు పైగానే ఉంటుంది.

విచారణ చేపడతాం రమాదేవి, ఆర్డీవో భూపాలపల్లి

అసైన్డ్, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ఆక్రమణలపై ఆయా ప్రాంతాల తహసీల్దార్లతో విచారణ చేయిస్తాం. ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు తీసుకుంటాం.

# కాలువలు ఇలా.. నీరు పారేదెలా?

మహబూబాబాద్ : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఎస్సారెస్పీ డీబీఎం కాలువలు అధ్వానంగా మారాయి. తుంగ, పిచ్చి మొక్కలు, మట్టి, ముళ్ల చెట్లతో నిండిపోయాయి. జలవనరుల శాఖ సాగుబడికి అనుకూలంగా నీటి ప్రణాళికలు రూపొందించి షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేస్తున్నా ... చివరి ఆయకట్టుకు మాత్రం నీరు అందడం లేదు. సరఫరా చేస్తున్న నీటిలో 30 శాతానికి పైగా వృథాగా పోతుంది. ఏపుగా పెరిగిన చెట్లను తొలగించిన దాఖలాలు లేవు. వీటిని తొలగించేందుకు అధికారులు ఏటా నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నా మోక్షం కలగడం లేదు. దీర్ఘకాలంగా కాలువల నిర్వహణ కొరవడింది.ఇది మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలోని ఎస్సారెస్పీ డీబీఎం–60 కాలువ. తొర్రూరులోని రెండో దశ ప్రధాన కాలువ నుంచి మరిపెడ వరకు విస్తరించింది. తొర్రూరు, దంతాలపల్లి, చిన్నగూడూరు, నర్సింహులపేట, మండలాల గ్రామాల్లోని 52,988 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలి. దీని నిర్మాణం చేపట్టి సుమారు 18 ఏళ్లు అవుతుంది. నాటి నుంచి నేటి వరకు కాలువకు ఇరువైపులా సీసీ లైనింగ్ చేయలేదు. ఇందులో మొలకెత్తిన మొక్కలు ఇప్పుడు వృక్షాలుగా మారాయి. చివరి ఆయకట్టుకు నీరందడం కష్టంగా మారింది. తుమ్మపొదలు.. పిచ్చి మొక్కలతో కనిపిస్తున్న డీబీఎం 22 కాలువ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి పరిధిలో ఉంది. దీని కింద ఆయకట్టు 1421 ఎకరాలు. పునర్జీవ పనులు ఐదేళ్ల కిందట చేపట్టారు. ఆ తర్వాత ట్టించుకోలేదు. మొక్కలు పెరిగి ఇరువైపులా నిర్మించిన సీసీ లైనింగ్ దెబ్బతింది. నీటిని విడుదల చేస్తే.. కాలువకు గండి పడే ప్రమాదం ఉంది. చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి.

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని డీబీఎం–38 కాలువకు అనుసంధానంగా చంద్రాయపల్లి, లెంకాలపల్లి గ్రామాల్లోని పంట భూముల వరకు ఏర్పాటు చేసిన పంట కాలువ. కొన్నేళ్లుగా నిర్వహణ కరవై తుమ్మలు, కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి కాలువ కనిపించకుండా పోయింది. నీళ్లు వదిలినా చేలకు పారడం గగనంగా ఉంది.

నిధులు మంజూరైనా పనులు జరగలేదు...

ఉమ్మడి జిల్లాలోని కాలువలకు చివరి సారిగా 2018లో మరమ్మతులు చేశారు. అప్పుడు అసంపూర్తిగానే పనులు మిగిలిపోయాయి. ఈ సారి కూడా ప్రధాన కాలువతో పాటు డీబీఎంల మరమ్మతులకు రూ.293.35 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఎస్సారెస్పీ మొదటి దశకు రూ. 163 కోట్లు, రెండో దశకు రూ.130.35 కోట్లు కేటాయించారు. అయినా పనులు ప్రారంభించక పోవడంతో మళ్లీ పాత కథే పునరావృతవుతోంది.

# తప్పుల తిప్పలు తప్పేదెలా?

ఖమ్మం : ఆధార్‌లో విద్యార్థుల వివరాలు తప్పుల తడకలుగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాటిని సరి చేసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు నానా తంటాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఆధార్‌లో ఉన్నట్లుగా వివరాలు నమోదు చేసుకోవాలని చెప్పటంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఆధార్‌లో విద్యార్థి వివరాలకు, క్షేత్రస్థాయిలో ఇంటి, అసలు పేరు, పుట్టిన తేదీల్లో చాలా వ్యత్యాసాలున్నాయి. దీంతో ఏ వివరాలు నమోదు చేయాలో అర్థంకాక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

సవరణలకు తంటాలు...

గతంలో ఉన్నత పాఠశాల స్థాయిలో ఆధార్ కేంద్రాలు పెట్టి కొంత వరకు నమోదు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో జరగలేదు. తప్పులను సరి చేయాలంటే విద్యార్థుల పుట్టిన తేదీ, ఇతర వివరాలను తీసుకుని ఆధార్ కేంద్రానికి వెళ్లాలి. గ్రామీణ స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులు అవన్నీ చేయలేక సరి చేసుకోవటం లేదు. మళ్లీ ఉన్నత పాఠశాలల స్థాయిలో కేంద్రాలను ఏర్పాటు చేసి సవరిస్తే విద్యార్థులకు ప్రయోజనంతో పాటు, సమగ్రమైన సమాచారానికి ఉపయుక్తంగా ఉంటుంది.

ఉదాహరణకు ఇలా...

ఖమ్మం పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థి ఇంటిపేరు షేక్ అని ఉండగా ఆధార్‌లో స్పెల్లింగ్ వేరేలా పడింది. దీన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సరి చేయలేదు. ఉపాధ్యాయులు మాత్రం వారి దగ్గర



ఉన్న జనన ధ్రువీకరణ పత్రం ప్రకారం రికార్డుల్లో నమోదు చేశారు. విద్యాశాఖ ఆధార్ ప్రకారం పేర్లు నమోదు చేయాలని ఆదేశించడంతో ఉపాధ్యాయులు ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఒకటి, రెండు తరగతులు చదివే విద్యార్థులకు తల్లిదండ్రులు ఆధార్ కార్డులు తీసుకోలేదు. స్థానికంగా ఉన్న ఆధార్ కేంద్రానికి వెళ్తే వేలిముద్రలు పడటం లేదు. దీంతో ఖమ్మం వెళ్లాలని సూచిస్తుండటంతో సమస్య ఉత్పన్నం అవుతుంది. ఎక్కువ మొత్తంలో విద్యార్థులకు ఆధార్ కార్డులు లేవు. ఖమ్మం జిల్లాలోని ప్రతి మండలంలో 500 మంది నుంచి 650 మంది వరకు విద్యార్థులకు ఆధార్ కార్డులు లేవు. దీంతో పాఠశాలల్లో వారికి పథకాలు వర్తించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులు గతంలో చదివిన పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువపత్రం తీసుకొస్తే దాని ప్రకారం ఉపాధ్యాయులు వివరాలు రికార్డుల్లో నమోదు చేస్తారు. ఆధార్ ప్రకారం చూస్తే ఇంటి, అసలు పేర్లలో తేడాలున్నాయి. ఆధార్‌లో ఉన్నట్లు పేర్లు నమోదు చేస్తే భవిష్యత్తులో ఉన్నత చదువులకు వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నవజాత శిశువులకు ప్రత్యేక అంబులెన్సులు

జనగామ : మెరుగైన చికిత్స కోసం ఒక ఆసుపత్రి నుంచి మరోచోటికి నవజాత శిశువులను చేర్చడానికి ప్రభుత్వం ప్రత్యేక అంబులెన్సులను ప్రవేశపెట్టింది. వాటిలో అధునాతన వైద్య పరికరాలు సైతం ఏర్పాటు చేసింది. ఈ అంబులెన్సులు నవజాత శిశువులకు వరంగా మారనున్నాయి. హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీష్‌రావు వీటిని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు కేటాయించిన ఒక్కో నియోనటల్ అంబులెన్సులు ఆయా జిల్లాలకు చేరుకున్నాయి. నవజాత శిశువులను అత్యవసర చికిత్స కోసం ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి తరలించడానికి, అలాగే ఆసుపత్రిలో కోలుకుంటున్న శిశువును వారి ఇళ్లకు సమీపంలోని ఆసుపత్రికి తరలించడానికి ఉపయోగిస్తారు. మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్‌లో భాగంగా శిశు మరణాల రేటును తగ్గించడానికి ఈ వాహనాలను ప్రభుత్వం ప్రారంభించిందని 108 వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ తెలిపారు. ఈ అంబులెన్సులు జిల్లాల్లోని ప్రసూతి



ఆసుపత్రుల్లో, వరంగల్‌లో సీకేఎం, హనుమకొండలో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (జీఎంహెచ్)లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఎన్‌ఐసీయూ పరికరాలు..నియోనటల్ అంబులెన్సులో అత్యాధునిక వైద్య పరికరాలను అమర్చారు. నియోనటల్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ (ఎన్‌ఐసీయూ)లో ఉండే అన్ని వైద్యపరికరాలు దీనిలో ఉంటాయి. నవజాత శిశువుకు ప్రారంభ క్షణాల్లో వెచ్చని వాతావరణం కల్పించే రేడియెంట్ వార్మర్, కామెర్లు చికిత్సకు ఉపయోగించే ఫొటోథెరపీ యంత్రం, నవజాత శిశువుల శరీరానికి కావలసిన ఉష్ణోగ్రతను అందించే ఇంక్యుబేటర్, రెస్పిరేటరీ సమస్య ఉన్న వారికి బబుల్‌క్యాప్, నియోనటల్ ఆక్సిజన్ వెంటిలేటర్, పోషకాలు, మందుల ద్రవాలు అందించడానికి ఇన్ఫ్యూషన్ సిరంజి పంపులు, ఆక్సిజన్ సరఫరాచేసే హుడ్స్, శిశువును తరలించే సమయంలో శ్వాసక్రియను అందించే ట్రాన్స్‌పోర్టు వెంటిలేటర్, శిశువు గుండె, శ్వాస రేటును ట్రాక్ చేసే కార్డియోపల్మనరీ మానిటర్, పల్స్ ఆక్సీమీటర్ ఉంటాయి. వీటిని మానిటర్ చేస్తూ శిశువును తరలిం చడానికి ప్రత్యేక శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లను ఈ వాహనాల్లో విధులు నిర్వహించేలా నియామకం చేసినట్లు అధికారులు తెలిపారు.

# కిన్నెరసాని గేట్ల మరమ్మతుల్లో జాప్యం



పాల్వంచ : కిన్నెరసాని రిజర్వాయర్ గేట్లు లీకవుతున్నాయి. 4 గేట్ల నుంచి జలాలు వృథాగా పోతున్నాయి. వర్షాలకు ముందే అధికారులు నిర్వహణపై దృష్టిసారించని వైనం నెలకొంది. నీటిమట్టం తగ్గితేనే మరమ్మతులు సాధ్యమవుతాయని పేర్కొంటున్నారు.

కిన్నెరసాని రిజర్వాయర్ నిర్మాణం 1972లో పూర్తయింది. ప్రాజెక్టు వ్యయం రూ.55.84 కోట్లు. 2 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహ సామర్థ్యాన్ని ఈ ప్రాజెక్టు తట్టుకోగలదు. ఎగువన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట, పాకాల, ప్రస్తుత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గుండాల, ఆళ్లపల్లి అటవీ ప్రాంతాల నుంచి ఎక్కువగా వరద వస్తుంది. జలాశయం నుంచి అధికంగా జలాలను కేటీపీఎస్ విద్యుదుత్పత్తికి వాడుతున్నారు. పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 8.2 టీఎంసీలు. ఇంత వరకు బాగానే ఉన్నా, గేట్ల లీకేజీపై మరింత దృష్టిసారించాల్సిన అవసరం కనిపిస్తోంది.

రూ.కోట్లు వెచ్చించినా.. తీరని సమస్య

రిజర్వాయర్ మరమ్మతులకు ప్రతిఏటా రూ.లక్షల్లో వెచ్చిస్తున్నారు. 2014లో అధికంగా రూ.1.20 కోట్లు ఖర్చుచేశారు. ఆ ఏడాది రోప్‌లు, రబ్బర్ సీల్స్, విడిభాగాలు మార్చడంతో పాటు పెయింటింగ్ వేశారు. ఆ తర్వాత కూడా లీకేజీల సమస్య వెంటాడుతూనే ఉంది. ప్రస్తుతం రబ్బర్ సీల్స్ సమస్య ఉత్పన్నమయ్యింది. అధికారులు మాత్రం పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి తప్పనిసరని పేర్కొంటున్నారు. ఇప్పుడు తలెత్తిన సమస్య పరిష్కరించాలంటే నీటిమట్టం డెడ్ స్టోరేజీకి (383 అడుగులకు) చేరాలి. లేదంటే మరమ్మతులు సాధ్యం కావు. ప్రస్తుతం 402 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తిస్థాయికి నీటిమట్టం చేరితే పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులుకు తెలిపారు.

రూ.80 లక్షలతో ప్రతిపాదనలు

కేటీపీఎస్ గేట్లు ఎత్తడానికి, ఈ ఏడాది నిర్వహణకు రూ.80 లక్షలతో టెండర్లు పిలవనున్నట్లు కేటీపీఎస్ అధికారులు పేర్కొన్నారు. మరమ్మతులు, ఇతర నిర్వహణ పనులకు ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. వర్షాలు కురుస్తుండటం, ఎగువ నుంచి వరద వస్తుండటంతో వచ్చే నెలలోనూ నీటిమట్టం తగ్గేలా లేదు.

కిన్నెరసాని గేట్ల పనులకు ఏటా రూ.80 లక్షలకు టెండర్లు పిలుస్తున్నాం. ఈ ఏడాదీ ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. నీటిమట్టం తగ్గితే మరమ్మతులు చేయడం సాధ్యపడుతుంది. ఉన్నఫళంగా జలాలు విడుదల చేస్తే కేటీపీఎస్, నవభారత్ కర్మాగారాలకు నీటి సరఫరా, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు తాగునీటి ఎద్దడి తలెత్తుతుంది. ప్రస్తుతం రబ్బర్ సీల్స్ కారణంగా ఏర్పడ్డ చిన్న లీకేజీలతో పెద్ద ప్రమాదం తలెత్తే అవకాశం లేదు. ప్రభాకర్, సీఈ, కేటీపీఎస్ 5, 6 దశలు

# నేర పరిశోధన ఇక పరుగులు



ఖమ్మం : సర్వజనాసుపత్రి మార్చురీ విభాగంలో ఫోరెన్సిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పరీక్షల నిర్వహణ, నివేదికల జారీలో నెలకొన్న ఇబ్బందులు తొలగిపోవడంతో బాధితులు ఊరట చెందుతున్నారు. గతంలో శవ పరీక్షల ప్రక్రియను మెడికల్ ఎగ్జామినర్(అందుబాటులో ఉన్న వైద్య నిపుణులు) ద్వారా నిర్వహించేవారు. పోలీసు పంచనామా రిపోర్టు అందిన తర్వాత ఆర్ఎంఓ అనుమతి మేరకు కేటాయించిన వైద్యుడు పరీక్షలు చేసేవారు. ఈ క్రమంలో బాధితులు చాలా సమయం నిరీక్షించాల్సి వచ్చేది. క్రిటికల్ కేసుల్లో మరణానికి గల కారణాలను గుర్తిస్తూ రూపొందించే నివేదిక కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆస్పత్రికి అనుబంధంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల రావడంతో ఫోరెన్సిక్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను నియమించారు. దీంతో శవ పరీక్షల సమయంలో ఎదురయ్యే ఆటంకాలు తొలగిపోయాయి. బాధిత కుటుంబీకులకు సకాలంలో సేవలు అందుతున్నాయి.

పరీక్షలు ఎంతో కీలకం

వ్యక్తి మరణం తర్వాత శవ పరీక్ష నివేదిక ఎంతో కీలకమైంది. మృతికి దారి తీసిన సంఘటనల శ్రేణిని నిర్ధారించాల్సిన అవసరం ఉంటుంది. ప్రమాదం, హత్య, ఆత్మహత్య, అత్యాచారం, సహజ, అనుమానాస్పద మరణాలు సంభవించినప్పుడు క్రిమినల్ కేసులను పరిష్కరించడానికి శవ పరీక్షలు కీలకంగా నిలుస్తాయి. పరీక్షల సమయంలో ఫోరెన్సిక్ నిపుణులు కణజాల నమూనాలను సేకరించి వాటి ఆధారంగా కారణాలను గుర్తిస్తారు. మృతదేహానికి శవ పరీక్ష చేయాలంటే తొలుత సంఘటన ప్రాంతానికి చెందిన పోలీసు స్టేషన్ నుంచి పంచనామా రిపోర్టు రూపొందిస్తారు. తర్వాత ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్(ఆర్ఎంఓ)కు అందజేస్తారు. విధుల్లో ఉన్న వైద్యాధికారుల్లో ఒకరికి మెడికల్ ఎగ్జామినర్ బాధ్యతలు అప్పగిస్తారు. ఆ రోజు ఓపీ, ఐపీ రోగులకు చికిత్సలు అందించిన తర్వాత సదరు వైద్యుడు శవ పరీక్ష పూర్తి చేస్తారు. ఈ ప్రక్రియలో జాప్యం నెలకొనడంతో పలుమార్లు బాధిత కుటుంబీకులు సైతం ఆందోళన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. మరోవైపు నేర పరిశోధన కేసుల్లో నివేదికలు ఆలస్యమయ్యేవి. క్రిమినల్ లా, సివిల్ లా కేసుల విచారణ సమయంలో వైద్యుడు సైతం ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఫోరెన్సిక్ నిపుణుడి రాకతో ఇటువంటి సమస్యలకు పరిష్కారం లభించింది. మార్చురీ వద్దే విభాగాన్ని ఏర్పాటు చేయడంతో నిపుణుడు పని వేళల్లో నిరంతరం అందుబాటులో ఉంటున్నారు. అలాగే జిల్లాలో ఏ ప్రాంత సంఘటనకు సంబంధించైనా క్రిటికల్ కేసులకు చెందిన మృతదేహానికి ఇక్కడే శవ పరీక్ష నిర్వహించి నివేదిక ఇస్తారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి మార్చురీ వద్ద పరీక్షల నిర్వహణ, నివేదికల జారీలో వేగం పెరగడంతో పాటు తగిన భరోసా లభిస్తుందని బాధితులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు రిపోర్టు ఉంటే వెంటనే శవ పరీక్ష పూర్తి చేస్తున్నాం. అనుమానాస్పద క్రిటికల్ కేసులకు ఇక్కడ పోస్టుమార్టం చేస్తాం. పరీక్షల నిర్వహణలో జాప్యాన్ని నివారించేందుకు పోలీసులు, బాధిత కుటుంబీకులు సహకరించాలి. కేసుల విచారణకు అవసరమైన నివేదికలు కూడా సకాలంలో అందజేస్తున్నాం. మార్చురీ వద్ద ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రక్రియ పూర్తి చేస్తున్నాం. రాథోడ్ వినాయక్, ఫోరెన్సిక్ నిపుణుడు

# ఎత్తు పడేస్తున్నారు!

ఖమ్మం : ఖమ్మం నుంచి దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో అండర్‌పాస్‌ల వివాదం నెలకొంది. ఎత్తు తగ్గించి నిర్మాణాలు చేపడుతుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట ఉత్పత్తులు తరలించడానికి భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తప్పవంటూ నిర్మాణాలను అడ్డుకుంటున్నారు. ఎత్తు పెంచేదాకా పనులు నిలిపివేయాలంటూ ఆందోళనకు దిగుతున్నారు. ఈ కారణంతోనే సత్తుపల్లి మండలం సదాశివునిపాలెంలో అండర్‌పాస్‌లు, రోడ్డు నిర్మాణ పనులను అడ్డగించారు.

సదాశివునిపాలెంలో మూడు నిర్మాణాలు

ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు దాదాపు రూ.3,352.96 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తున్నారు. మొత్తం 165 కి.మీ. మేర అయిదు ప్యాకేజీలుగా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అండర్‌పాస్‌ల వ్యవహారం చిక్కుముడిగా మారింది. గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో పలు ప్రాంతాల్లో వందకుపైగా అండర్‌పాస్‌లను ఏర్పాటు చేయనుండగా.. వీటిలో సదాశివునిపాలెంలోనే మూడు ఉన్నాయి. వాటిని గ్రామంలోని సబ్‌స్టేషన్, వైకుంఠధామం వద్ద రెండింటిని, మరొకటి వరిచేల సమీపంలో ఏర్పాటు చేస్తున్నారు. సబ్‌స్టేషన్ వద్ద నిజాం కాలం నాటి ఏపీ, తెలంగాణ లింక్ రోడ్డు ఉంది. ఇక్కడ కేవలం 7 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పుతో.. వైకుంఠధామం, పొలాల వద్ద 6.9 అడుగుల ఎత్తు, 14 అడుగుల వెడల్పుతోనే అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు. దీంతో రైతులు, గ్రామస్థులు వ్యతిరేకత తెలుపుతున్నారు. ఎత్తు తక్కువయితే రోడ్డుకు అవతలవైపు ఉన్న దాదాపు 500 ఎకరాల్లోని పంట ఉత్పత్తులు తరలించడానికి తీవ్ర ఇబ్బందులు తప్పవని గగ్గోలు పెడుతున్నారు. తక్కువ ఎత్తునున్న అండర్ పాస్‌ల నుంచి ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, చెరకు లారీలు, గడ్డిలోడ్లు వంటివి రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉండదన్నారు. దీనివల్ల భవిష్యత్తులో అనేక ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు.

ఫిర్యాదులిచ్చినా స్పందన శూన్యం

గ్రీన్‌ఫీల్డ్ అండర్‌పాస్‌ల ఎత్తు పెంచాలని ఇప్పటికే జేసీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, గ్రీన్‌ఫీల్డ్ గుత్తేదారులకు సదాశివునిపాలెం రైతులు ఫిర్యాదులు చేశారు. అయినా ఇటీవల సబ్‌స్టేషన్ వద్ద ఏడడుగుల ఎత్తులోనే స్లాబ్ వేస్తుండటంతో అడ్డుకున్నారు.

ఏపీలో పెంచి.. తెలంగాణలో తగ్గించి..

ఏపీలోని చింతలపూడి మండలం కమలాపురం బీటీ రోడ్డు వద్ద 12 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పుతో అండర్‌పాస్ ఇచ్చి



తెలంగాణలోని ఎస్ఎస్‌పాలెంలో అండర్‌పాస్‌లు తక్కువ ఎత్తులో వేస్తున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు.

ఎత్తు పెంచకుంటే పనులు నిలిపేస్తాం

ఆళ్ల నాగేశ్వరరావు, రైతు, సదాశివునిపాలెం

అండర్‌పాస్‌ల ఎత్తు పెంచకుంటే ఎట్టి పరిస్థితుల్లో పనులు చేయనివ్వం. ఎత్తు పెంచుతామని నమ్మబలికి ఆఖరికి .. 7 అడుగుల లోపే స్లాబ్ వేసేందుకు అధికారులు ప్రయత్నించారు. ఎత్తు పెంచితే అర కిలోమీటర్ ప్రయాణంతోనే వ్యవసాయ పనులు చక్కబెట్టుకోవచ్చు. తక్కువ ఎత్తులో నిర్మిస్తే భీమవరం రోడ్డు మీదుగా తుంబూరు, సదాశినిపాలెంకు ఇలా మొత్తం ఏడు కిలోమీటర్లు రాకపోకలు చేయాల్సి వస్తుంది. కనీసం పంట ఉత్పత్తులు తరలించుకునేలా అవసరమైతే సర్వీస్ రోడ్డు అయినా ఇవ్వాలి.

ఉన్నతాధికారులకు సమస్యను నివేదించాం..అండర్ పాస్‌ల వివాద అంశమై నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాం. ప్రస్తుతం ఉన్న నిర్మాణ దశలో మార్పులు, చేర్పులు చేస్తే జరిగే పర్యవసానాలపై పూర్తి స్థాయిలో రిపోర్ట్ చేశాం. వాటి ఎత్తు పెంచాలంటే ట్రాఫిక్ అంశాలను కూడా సర్వే చేయాలి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి తదుపరి చర్యలు చేపడతాం. దివ్య, మేనేజర్, ఎన్‌హెచ్ఏఐ

# విద్యా రుణాలకు మరింత సహకారం

పాల్వంచ : విదేశాల్లో.. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఉన్నత చదువు నేడు ప్రతి విద్యార్థి కలగా మారింది. ఆసక్తి ఉన్న కోర్సు చదివేందుకు ఉన్నత విద్యావంతులు విదేశాలకు బారులుదీరుతున్నారు. ఇలాంటి వారికి విద్యా రుణాలు (ఎడ్యుకేషన్ లోన్స్) ఎంతో ఊతమిస్తున్నాయి. లేదంటే విదేశాల్లో చదువులు తీరని కలగానే మిగిలేవని చెప్పవచ్చు. మన్యం ప్రాంతంలో విదేశీ విద్య రుణాలు పొందేందుకు ఇన్నాళ్లూ ఓ ఆటంకం ఎదురైంది. ఇప్పుడది తొలగిపోవడం ఊరటనిస్తోంది. 2020, నవంబరు నుంచి అందుబాటులోకి వచ్చిన ‘ధరణి’లో మన్యం ప్రాంతం వారికి ‘మార్టిగేజ్’ ఆప్షన్ ఇవ్వలేదు. ఇప్పుడు ఆ ఆప్షన్ కొత్తగా చేర్చారు. ఈ నెల ఆరంభం నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తులు, విలువైన ప్లాట్లు బ్యాంకుల్లో తనఖా పెట్టి.. రూ.లక్షల్లో విద్య, వ్యాపారాలకు రుణాలు పొందే అవకాశం కలిగింది. దీన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఏజెన్సీ ప్రాంత రైతు కుటుంబాల విద్యార్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

479 మంది.. 77.22 కోట్లు!

ఆగస్టు ముందు వరకు మైదాన ప్రాంత విద్యార్థులకు మార్టిగేజ్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లు రూ.4 లక్షల వరకు ఎలాంటి గ్యారంటీ లేకుండా స్వదేశీ, విదేశీ



విద్యా రుణాలను మంజూరు చేశాయి. ఒక గ్యారంటర్‌పై 7.5 లక్షల వరకు ఇచ్చాయి. అంతకు మించి కావాలంటే తగిన విలువైన ఆస్తిని తనఖా పెట్టాల్సి ఉంటుంది. గ్రామీణ విద్యార్థులను ఉన్నత చదువుల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో డీసీసీబీలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు అత్యధికంగా 479 మందికి విద్యా రుణాలిచ్చారు. వీటి విలువ రూ.77.22 కోట్లు. దీంతో యూకే, కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో చదివేందుకు విద్యార్థులు తరలివెళ్లారు.

రుణం తీసుకోవాలంటే..

రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డును జతపరచి ‘మీ సేవ’లో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆ తేదీన సంబంధిత బ్యాంకు మేనేజరు (మార్టిగేజ్), దరఖాస్తుదారుడైన (రైతు) మార్టిగేజర్.. ఇద్దరూ కలిసి తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలి. బయోమెట్రిక్ ఆధారంగా వివరాలు సమర్పించాలి. తహసీల్దార్ అవన్నీ పరిశీలించి తన డిజిటల్ సంతకంతో భూమి పూర్తి ఆధారాలు బ్యాంకర్‌కు ఇస్తారు. ఆ ప్రాపర్టీ విలువ ఆధారంగా బ్యాంకరు విద్య, వ్యాపార రుణాలు మంజూరు చేస్తారు. ఏజెన్సీలో ఎకరాకు రూ.1.8 లక్షలు, మైదాన ప్రాంతంలో రూ.5 లక్షల వరకు రుణం లభిస్తోంది. ప్లాట్లు అయితే బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా రుణం పెంచుతారు.

కొత్తగూడెం డీసీసీబీ నుంచి 2017లో రూ.30 లక్షలు తీసుకున్నా. ఈ లోనుతో యూఎస్‌లోని వాషింగ్టన్ రాష్ట్రంలో ఎమ్మెస్ పూర్తిచేశా. 2019లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. యూఎస్‌లోనే స్థిరపడిపోయా. విదేశీ విద్యకు రుణం కావాలంటే డీసీసీబీ వారు చక్కగా సహకరిస్తారు. ప్రాపర్టీపై 80 శాతం రుణాన్ని 12 శాతం వడ్డీతో ఇస్తారు. ఉద్యోగంలో చేరిన 3 నెలల తర్వాత తిరిగి చెల్లించే అవకాశాన్ని కల్పిస్తున్నారు. మల్లెల నిఖిత, సుజాతనగర్, భద్రాద్రి జిల్లా

బ్యాంకు సాయంతోనే విదేశీ విద్య

పాల్వంచ సహకార బ్యాంకు వారివద్ద ఆస్తులు తనఖా పెట్టి రూ.17.50 లక్షలకు విదేశీ విద్యా రుణం తీసుకున్నా. యూఎస్ఏ న్యూ హ్యాంప్‌షైర్‌లోని రివియర్ వర్సిటీలో ఎమ్మెస్ అభ్యసిస్తున్నా. బ్యాంకు సహకారం లేకుంటే ఉన్నత చదువు కల నెరవేరేది కాదు. మేడవరపు సాయికీర్తన్, శివనగర్‌కాలనీ, పాల్వంచ

ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి జిల్లాకు ‘ధరణి’లో ఈ నెల ఆరంభం నుంచి మార్టిగేజ్ రుణాల ఆప్షన్ ఇచ్చారు. డీసీసీబీల ద్వారా విదేశాలకు వెళ్లే విద్యార్థులకు మరిన్ని రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాపర్టీ విలువ, అర్హతల ఆధారంగా రుణం మొత్తాన్ని నిర్ణయిస్తాం. బంధువుల సమ్మతితో వారి ఆస్తులపైనా రుణాలు పొందే వెసులుబాటును విద్యార్థులకు కల్పిస్తున్నాం. రబాబు, సీఈవో, ఉమ్మడి ఖమ్మం జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్

# పిల్లలేం చేశారు?

కొత్తగూడెం : పట్టణం రామవరంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రానికి (ఎంసీహెచ్) గర్భిణులు, మహిళలతో పాటు నిత్యం పదుల సంఖ్యలో చిన్నారులు వస్తుంటారు. ఆసుపత్రిలో ఉన్నంత సేపూ వీరి ఆలనాపాలనా కోసమని ఆసుపత్రి ఆవరణలో రూ.20 లక్షల ‘పట్టణ ప్రగతి’ నిధులతో పార్కు నిర్మించారు. ఇప్పుడది నిర్వహణ కొరవడి పిచ్చిమొక్కలు, తుమ్మ పొదలకు నెలవుగా మారింది. పిల్లలు ఆడుకునేలా, ఆహ్లాదాన్ని పంచేలా తీర్చిదిద్దాల్సిన ఉద్యానవనం కళావిహీనంగా



తయారైంది. మాతా శిశు విగ్రహం, నీటికొలను, ఆట వస్తువులు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. తుదిపనులూ పూర్తిచేయని పురపాలకం.. నిర్వహణను సైతం గాలికొదిలేసింది. పార్కు పనుల కోసం ఓ మహిళా కార్మికురాలిని నిర్మించి.. గత 8 నెలలుగా ఆమెకు వేతనాలు చెల్లించడం లేదు. పిల్లల కోసం, గర్భిణులు, బాలింతలకు ఆహ్లాదాన్ని పంచేలా ఉద్యానవనం నిర్వహణను గాడిలో పెట్టాలని ఇక్కడకు వచ్చేవారు కోరుతున్నారు.

# అటవీ వీరుడి కుటుంబానికి అవమానం!

ఖమ్మం : ఆయన అటవీ భూమిని పరిరక్షించడంలో తెగువ చూపారు... విధి నిర్వహణలోనే హత్యకు గురై ప్రాణాలు కోల్పోయాలు... ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అంత్యక్రియల్లో పాల్గొని ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. సేవలకు గుర్తింపుగా రూ.50 లక్షల పరిహారం, 500 చ.గ ఇంటి స్థలం, భార్యకు ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. హామీల అమలులో భాగంగా ఇచ్చిన ఇంటి స్థలానికి ఏర్పాటు చేసిన ప్రహరీని కొద్ది రోజులకే తొలగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది మృతుని కుటుంబాన్ని అవమానించడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పరిహారం ఇలా...

శ్రీనివాసరావు కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, 500 చగ ఇంటి స్థలం, భార్య భాగ్యలక్ష్మికి ఉద్యోగావకాశం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఖమ్మం నగరంలో బుర్హాన్‌పురం రెవెన్యూ సర్వే నెం.93లో 500 చగ ఇంటి స్థలాన్ని కేటాయించారు. సర్వ హక్కులు కల్పించేందుకు ప్రభుత్వ ధర ప్రకారం చదరపు గజానికి రూ.9,500 చొప్పున మొత్తం రూ.47.5 లక్షలు చెల్లించాలని కోరారు. దీన్ని పింఛనులో నెలకు 39,585 చొప్పున పదేళ్లపాటు చెల్లించేందుకు శ్రీనివాసరావు కుటుంబం అంగీకరించింది. దీంతో స్థలానికి ఉత్తర్వుల ను ఖమ్మం జిల్లా కలెక్టరు వీపీ గౌతమ్ చేతుల మీదుగా 2023 జనవ రి ఒకటిన భార్య భాగ్యలక్ష్మికి అందజేశారు. సదరు స్థలానికి గూగుల్



మ్యాప్‌తో సహా ఖమ్మం అర్బన్ రెవెన్యూ అధికారులు అందించారు.

ప్రహరీ తొలగింపు...

తదుపరి శ్రీనివాసరావు కుటుంబాన్ని కలెక్టరేట్‌కు పిలిపించి ప్రహరీ నిర్మించుకోవాలని, బోరు వేసుకుని నల్లా కనెక్షను తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు రూ.2 లక్షలు వెచ్చించి సదరు స్థలానికి రెడీమేడ్ ప్రహరీని ఏర్పాటు చేసుకున్నారు. అందులో ఉన్న నిద్రగన్నేరు చెట్టు తొలగించేందుకు ఆ కుటుంబం అటవీ శాఖకు చలానా కూడా చెల్లించింది. కానీ రెండు రోజుల్లోనే సదరు ప్రహరీని రాత్రికిరాత్రి తొలగించడం చర్చనీయాంశమైంది. వేలాది ఎకరాల అటవీ భూమిని కాపాడి ప్రభుత్వానికి విశేష సేవలందించిన మృతుడు శ్రీనివాసరావును అవమానించడమేనంటూ దీనిపై ఈర్లపూడి గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

హత్య నేపథ్యమిదీ...పోడు సాగుకు అడ్డు వస్తున్నాడని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు బీట్లో 2022 నవంబరు 22న జరిగిన గొత్తికోయల దాడిలో అటవీ శాఖ ఫారెస్ట్ రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావు(40) మృతి చెందారు. దీనిపై ఆ శాఖ ఉద్యోగులు తీవ్ర నిరసన తెలిపాయి. ఆయన హత్యపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రభుత్వం పరిహారం ప్రకటించి ంది. నీటి పారుదల శాఖ స్థల వివాదం న్యాయస్థానంలో ఉంది. ఎన్నెస్పీ ఉద్యోగులు ఈ స్థలం తమకే కేటాయించాలని గతంలో న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. సీఈ కార్యాలయం నిర్మించాలనే ప్రతిపాదన కూడా ఉంది. ఉత్తర్వులు ఇచ్చినా సదరు స్థలాన్ని శ్రీనివాసరావు కుటుం బానికి స్వాధీనం చేయలేదు. ప్రత్యామ్నాయ స్థలం అన్వేషిస్తున్నాం. త్వరలోనే కలెక్టరు చేతుల మీదుగా అందజేస్తాం. శైలజ, తహసీల్దారు, ఖమ్మం అర్బన్

# ఆధ్యాత్మిక ఉట్టిపడేలా.. పర్యాటకులను ఆకర్షించేలా

ఖమ్మం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలో సుమారు 900 ఎకరాల భూమి ఉంది. ఇందులో చాలావరకు భూమి ఆక్రమణకు గురవగా 104 ఎకరాలకు సంబంధించి వివాదాలు లేవని అధికారులు తేల్చారు. ఈప్రదేశం రామాలయానికి 3.కి.మీ దూరంలో ఉంటుంది. దీన్ని ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆలయాధికారులు నిర్ణయించారు. నాలుగేళ్ల క్రితం గోశాలలను ఏర్పాటుచేయాలని సంకల్పించారు. ఇప్పటికే రెండింటి నిర్మాణాలు పూర్తవగా మరో పదింటిని కట్టాల్సి ఉంది. ఒక్కో షెడ్డులో 20 చొప్పున గోవులను ఉంచుతున్నారు. మిగతా పది ఆవులను వెలుపలే కట్టేస్తున్నారు. మొత్తానికి 12 గోశాలల్లో 200 ఆవులను సంరక్షించాలని భావిస్తున్నారు. ఈ గోవుల పాలతో నిత్యకైంకర్యాలు, అన్నదానం ఇతర అవసరాలు తీర్చుకోవాలని యోచిస్తున్నారు.

ప్రతిపాదనలు ఇలా..శ్రీకృష్ణుడి విగ్రహం: గోవుతో కలిసి 36 అడుగుల ఎత్తు కలిగిన శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటుకు రూ.12 లక్షలు అవసరం.

తులసి వనం: నిత్య కైంకర్యాలకు అరెకరంలో తులసి వనం పెంచేందుకు రూ.2 లక్షలు కావాలి.

నక్షత్ర వనం: 27 నక్షత్రాలకు సంబంధించిన వృక్షాలు పెంచాలి. వీటికి అనుబంధంగా దేవతల విగ్రహాలను ఏర్పాటుచేయాలి. భక్తులు వీటి చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు సదుపాయాలు కల్పించాలి. ఇందుకోసం రూ.16 లక్షలు వెచ్చించాలి.

రాశి వనం: 12 రాశులకు సంబంధించిన వృక్షాలను పెంచాలి. వీటికి సంబంధించిన దేవతా విగ్రహాలను తయారుచేసి పూజించాలి. ఇందుకోసం రూ.7 లక్షలు అవసరం.

నవగ్రహ వనం: తొమ్మిది గ్రహాలకు చెందిన వృక్షాలు పెంచి వాటి ముందు దేవతామూర్తులను ప్రతిష్ఠించేందుకు రూ.5 లక్షలు కావాలి.

పంచవటి వనం: సముద్రాల పేరుతో ఐదు దేవతా వృక్షాలతో దీన్ని నిర్మించేందుకు రూ.3 లక్షలు కేటాయించాలి.

పుష్ప వనం: దేవుడి పూజలకు ఉపయోగించే పూల కోసం రెండెకరాల్లో తోటల సాగుకు రూ.3 లక్షలు అవసరం.

వసంత మండపం: ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా రాములోరికి ప్రత్యేక మండపంలో వన విహార పూజ చేయాలి. ఇందుకోసం శాశ్వత నిర్మాణానికి రూ.15 లక్షలు కావాలి.

పార్కు: పర్యాటకులకు ఆధ్యాత్మిక భావం కలిగించేలా దీన్ని ఏర్పాటుచేయాలి. పిల్లలకు వినోదం, ఆహ్లాదం పంచాలి. క్రీడలకు వీలుండాలి. దీనికి రూ.10 లక్షలు ఖర్చవుతుంది.

అలంకరణ వనాలు: మామిడి, కొబ్బరి, అరటి ఆకులను ఆలయంలో తోరణాలు కట్టడానికి ఉపయోగిస్తారు. కాయలను పూజలకు వినియోగిస్తారు. ఇందుకోసం ఐదెకరాల్లో తోటలను పెంచేందుకు తొలివిడతగా రూ.10 లక్షలు అవసరం.

దాతలకు ప్రత్యేక మర్యాదలుదాతల సాయంతో గోశాల ప్రాంగణంలో శ్రీరామ జెండాను ఎగురవేస్తారు. ప్రత్యేక ద్వారాలతో పాటు సరిపడా ప్రహరీ నిర్మిస్తారు. అంతర్గత రహదారుల్లో విద్యుద్దీపాలు అమర్చుతారు. గోవులకు పచ్చిగడ్డి పెంచుతారు. చెరువును విస్తరిస్తారు. నీటి సదుపాయం కోసం బోరుబావులు తవ్వించి మోటార్లతో పాటు ట్యాంకులను సిద్ధంగా ఉంచుతారు.

# తవ్వేకొద్దీ అక్రమాలు



ఖమ్మం :గిరిజన సొసైటీ పేరుతో గోదావరి ఒడ్డున ఇసుకను తోడేస్తున్నారు. గడువు ముగిసినా, నిబంధనలు అతిక్రమించి రాత్రివేళలో యంత్రాలతో తవ్వి తరలిస్తున్నారు. అయినా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. మండలంలోని రామారావుపేట గ్రామ పంచాయతీ పరిధి రేగుబల్లి గోదావరి నదీ వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ అక్రమాలకు నిలయంగా మారింది.

గిరిజన సొసైటీకి రీచ్ అనుమతి

రామారావుపేట గోదావరి ఒడ్డున ప్రభుత్వం అధికారికంగా ఇసుక రీచ్ ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీలోని దాదాపు 180 మంది గిరిజనులతో ఓ సొసైటీని ఏర్పాటు చేయగా అందులోని మహిళలను 9 మంది డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. ఇసుక తరలింపు నిర్వహణ వ్యవహార బాధ్యతలను మొత్తం గిరిజన సొసైటీకి ప్రభుత్వం అప్పగించింది. 2.20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించడానికి సొసైటీకి మైనింగ్ శాఖ అనుమతులు మంజూరు చేసింది. దీంతో 2022 జూన్ 14 నుంచి ప్రక్రియ ప్రారంభించారు.

గడువు ముగిసినా ఇష్టారాజ్యం

ఇసుక రీచ్ అనుమతులు గిరిజన సొసైటీకి ఇచ్చినా రానురాను గుత్తేదారుల వశమైంది. అధికారుల బాధ్యతారాహిత్యం, గుత్తేదారుల అవినీతి కారణంగా లక్షలాది రూపాయల ఖరీదు చేసే ఇసుక నల్లబజారుకు తరలిపోతోంది. మైనింగ్ శాఖ నుంచి 2022 డిసెంబర్ 20 వరకు మాత్రమే ఇసుక తీయడానికి అనుమతులున్నాయి. గడువు ముగిసినా లెక్కాపత్రం లేకుండా ఇసుక తవ్వి తరలిస్తున్నారు.

రాత్రి పూట.. పొక్లెయిన్లతో తవ్వకాలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మ్యాన్ పవర్ ద్వారా వెసులుబాటును బట్టి మీటరున్నర లోతున ఇసుక తవ్వకాలు చేపట్టాలి. గుత్తేదారులు వీటిని తోసిరాజని రీచ్‌లో పొక్లెయిన్లు వినియోగించి 5 మీటర్లపైనే లోతులో ఇసుక తవ్వి తరలిస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి రీచ్‌కు దగ్గరగా ఉన్న రేగుబల్లి గ్రామంలో బోర్లు వేసినా నీరు పడటంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇక ప్రధాన రహదారి నుంచి ఇసుక లారీలు రాకపోకలు సాగించడంతో రోడ్డు దెబ్బతింది. నామమాత్రంగానే రోడ్డు తడుపుతున్నా ఒక్కోసారి వాహనదారులు కిందపడి గాయాలపాల వుతున్నారు.

డైరెక్టర్లకు నోటీసులు

ఇంతవరకు ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుకను బయటకు తరలించారనే వివరాలను సంబంధిత గ్రామపంచాయతీకి విధిగా అప్పగించాల్సిన గిరిజన సొసైటీ సభ్యులు తమకేమీ తెలియనట్లు మిన్నకుండిపోయారు. దీంతో పది రోజుల్లోగా గ్రామ పంచాయతీకి ఇసుక తరలించిన వివరాలను అప్పగించాలని ఈ నెల 1న గిరిజన కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్లకు పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ నోటీసులు జారీ చేశారు. గడువు తేదీ ఎప్పటి వరకు ఉందో తెలుసుకుంటాం. రాత్రి వేళలో పొక్లెయిన్‌లతో రీచ్‌ల నుంచి ఇసుక తరలిస్తున్న విషయంపై విచారణ జరిపి చర్యలు చేపడతాం.

జయసింగ్, మైనింగ్ ఏడీ కొత్తగూడెం

# అభాగ్య మహిళలకు అండ




ఖమ్మం : భర్త, కుటుంబ సభ్యుల హింసకు గురవుతున్న మహిళలకు అండగా నిలబడుతోంది 'సఖి' కేంద్రం. సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు చొరవ చూపుతోంది. అలాకాని పక్షంలో సదరు మహిళకు న్యాయ సహాయం అందించడం, సలహాలు ఇవ్వడంతోపాటు ఆశ్రయం కల్పిస్తోంది. 'స్వధార్' కేంద్రం సహకారంతో సొంతకాళ్లమీద నిలబడేందుకు శిక్షణ సైతం ఇస్తున్నారు. అభాగ్య మహిళల పాలిట కల్పవృక్షంగా మారిన 'సఖి' కేంద్రంలో అందిస్తున్న సేవలపై ప్రత్యేక కథనం...'బాలికలు, స్త్రీలపై జరిగే హింసను ఆపుదాం, వారికి అండగా ఉందాం' అనే నినాదంతో 2017 ఖమ్మంలో సఖి కేంద్రం ఏర్పాటైంది. నాటి నుంచి ఎంతో మంది మహిళలకు అండగా ఉంటుంది. ఆశ్రయించిన వారికి పరిష్కార మార్గాలను చూపుతూ భరోసా ఇస్తుంది. 24 గంటలూ అందుబాటులో ఉంటోంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, కుటుంబ సభ్యులు, భర్త మహిళను మానసికంగా, శారీరకంగా హింసించడం, మానవ మృగాల చేతిలో మోసపోతున్న అమ్మాయిలు 'సఖి' కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు.

కౌన్సెలింగ్ చేస్తూ... రాజీ కుదుర్చుతూ

కేంద్రం వైద్యం, కౌన్సెలింగ్, పోలీసు, న్యాయం, వసతులు అనే ఐదు విభాగాలతో సమ్మిళితమై ఉంటుంది. భర్త లేదా కుటుంబ సభ్యులు ఒక స్త్రీని మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తే ఆ మహిళ సఖి కేంద్రాన్ని ఆశ్రయించవచ్చు. భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని వేధించడం, గృహ నిర్బంధం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటం వంటివి చేస్తుంటే బాధితురాలు కేంద్రాన్ని ఆశ్రయించవచ్చు. ఈ కేంద్రాన్ని సంప్రదిస్తున్న వారిలో నిరుపేద ఎస్సీ, ఎస్టీ మహిళలే అధికంగా ఉంటున్నారు. అక్కడ ఉండే సామాజిక కౌన్సిలర్లు సదరు మహిళను, ఆమె భర్తను పిలిచి విడివిడిగా కౌన్సెలింగ్ చేస్తారు. ఇద్దరి నివేదికను పరిశీలించి రాజీ కుదురుస్తారు. ఆ దంపతులపై ఆరు నెలల వరకు అంగన్‌వాడీ టీచర్లతో పర్యవేక్షణ ఉంచుతారు. సయోధ్య కుదరని పక్షంలో న్యాయ కౌన్సెలర్ ద్వారా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు.

సయోధ్య కుదిర్చిన జంటలెన్నో... నగరంలో నివాసముండే మహిళకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. ఓ యువకుడు ఆమెకు మాయమాటలు చెప్పడంతో నమ్మి అందరినీ వదిలేసి వచ్చి అతన్ని వివాహం చేసుకుంది. 6 నెలల తర్వాత సదరు యువకుడికి మరో మహిళతో సంబంధం ఉందని తెలిసింది. అప్పటినుంచి అతను భార్యని రకరకాలుగా హింసించేవాడు. బాధితురాలు సఖి కేంద్రాన్ని ఆశ్రయించగా వారికి కౌన్సెలింగ్ ఇచ్చి రాజీ కుదిర్చారు. ఓ యువ దంపతులు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవించేవారు. ఉన్నట్టుండీ వారి మధ్య డబ్బు విషయమై, తనని బాగా చూసుకోవడం లేదనే కారణాలతో తరచూ గొడవపడేవారు. దంపతులిద్దరి తల్లిదండ్రులు తమ బిడ్డలకు మద్దతుగా నిలిచారు. అలా వారి మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. బాధితులు సఖి కేంద్రాన్ని ఆశ్రయించగా వారిద్దర్ని ఒకటి చేశారు. ప్రస్తుతం ఆ దంపతులు సంతోషకర జీవితాన్ని గడుపుతున్నారు. ఇలాంటి ఉదాహరణలెన్నో...

181 కాల్‌తో సత్వర స్పందనభర్త లేదా కుటుంబ సభ్యులు మహిళలపై హింసకు పాల్పడితే 181 నంబరుకు కాల్ చేస్తే సఖి సిబ్బంది సత్వరమే స్పందిస్తారు...

అవసరార్థులకు ఆర్థిక స్వావలంబనసఖి కేంద్రాన్ని ఆశ్రయించిన మహిళకు 5 రోజుల పాటు వసతి కల్పిస్తారు. గడువు పూర్తయిన తర్వాత వారు వెళ్లాలని అనుకుంటే పంపించేస్తారు. ఒంటరి మహిళ, బాలిక.. వారికి ఇష్టం అయితే 'స్వధార్ గృహం'లో చేరుస్తారు. అక్కడ కుట్లు, అల్లికలు తదితర రంగాల్లో శిక్షణ అందిస్తారు. ఈ గృహం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పర్యవేక్షణలో ఉంటుంది.

# కొలువుల వేటలో కొత్త నమూనా

ఖమ్మం : ఎట్టకేలకు ఖమ్మం నగరంలో నమూనా ఉపాధి కేంద్రం (మోడల్ కెరీర్ సెంటర్) కొలువుదీరింది. టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో కట్టిన భవనంలో ఈ నెల 4న జరిగే జాబ్‌మేళాతో కార్యకలాపాలు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. దశాబ్దాలుగా మూస పద్ధతిలో కొనసాగుతున్న ఉపాధి కల్పన శాఖ రూపురేఖలు మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ మోడల్ కెరీర్ సెంటర్లను ఏర్పాటు చేసింది. భవన నిర్మాణానికి రూ.15 లక్షలు నిధులు అందించింది. మూడేళ్ల జాప్యం తర్వాత ఇప్పటికి పనులు పూర్తయ్యాయి. ఇందుకోసం జిల్లా యంత్రాంగం రూ.2 లక్షల నిధులు అందించింది. నిజానికి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఇక్కడకు మార్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసినా ఆ శాఖ నూతన కలెక్టరేట్ భవనంలోకి చేరింది. జాబ్‌మేళాలు నిర్వహించి ఇక్కడా ఉపాధి సేవలు అందించాలని ఆ శాఖ నిర్ణయించింది. మోడల్ కెరీర్ సెంటర్‌లో కేంద్రం యంగ్ ప్రొఫెషనల్ పేరుతో ఓ పోస్టు ఏర్పాటు చేశారు. ఇతను జిల్లా ఉపాధి కల్పనాధికారి పర్యవేక్షణలో జిల్లాలోని కళాశాలలకు వెళ్లి ఉద్యోగ, ఉపాధి సమాచారంపై అవగాహన కల్పిస్తారు. కార్యాలయంలో యువ సదస్సులు నిర్వహిస్తారు. ఇందుకోసం హాలు ఉంది. యువత ఉపయోగార్థం కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. ఉద్యోగాల వర్చువల్ ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించుకునే సదుపాయాలు పొందుపర్చారు. బిహార్ రాష్ట్రానికి చెందిన ధర్మేంద్ర కుమార్ యంగ్ ప్రొఫెషనల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సెంటర్ కోసం కంప్యూటర్లు, ఇతర సామగ్రి వచ్చాయని, 4న ఉద్యోగ మేళాతో కేంద్రం అందుబాటులోకి వస్తుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ వివరించారు.

# యంత్రం.. నాణ్యత మంత్రం

సింగరేణి వ్యాప్తంగా ఉన్న మిగతా ఉపరితల గనుల కంటే భిన్నంగా కోయగూడెం, మణుగూరు పీకే ఓసీలో బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. సాధారణంగా ఉపరితల గనుల్లో బ్లాస్టింగ్, డ్రిల్లింగ్ ద్వారా బొగ్గు ఉత్పత్తి అవుతుంది. సింగరేణి చరిత్రలోనే మొట్టమొదటిసారిగా కోయగూడెం ఓసీ ఏర్పాటైన 2002 నుంచి, ఇటీవల మణుగూరు పీకే ఓసీలో మాత్రమే సర్ఫేస్‌మైనర్ యంత్రం ద్వారా బొగ్గు ఉత్పత్తి జరుగుతుండటం విశేషం.

రోజుకు 10వేలు-15వేల టన్నుల ఉత్పత్తి..

ప్రస్తుతం సింగరేణి వ్యాప్తంగా ఉన్న 19 ఓసీల్లో కోయగూడెం, మణుగూరులో మాత్రమే సర్ఫేస్‌మైనర్ ద్వారా బొగ్గును ఉత్పత్తి చేస్తున్నారు. ఒక్కో యంత్రం విలువ రూ.6కోట్లు. ప్రస్తుతం కోల్ టెండర్ పొందిన గుత్తేదారులే సర్ఫేస్‌మైనర్ యంత్రాన్ని కొని బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానం ద్వారా మిగిలిన ఓసీల్లో రోజుకు 8వేలు- 10వేల టన్నులు ఉత్పత్తి చేస్తుంటే.. సర్ఫేస్‌మైనర్ యంత్రాల ద్వారా రోజుకు 15వేలు- 20




వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుండటం విశేషం. కోల్‌బెంచ్, ఓబీ సహకరిస్తే రోజుకు 25వేల టన్నుల వరకూ ఉత్పత్తి చేసే సామర్థ్యం సర్ఫేస్‌మైనర్ యంత్రం సొంతం.

ప్రత్యేకతలు..డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానం ద్వారా బొగ్గు ఉత్పత్తి చేసే సమయంలో తక్కువ నాణ్యత ఉన్న షేల్, స్టోన్‌లు కలిసిపోతుంటాయి. 30సెంటీమీటర్ల లేయర్ వారీగా నాణ్యమైన బొగ్గు, షేల్‌ను ఈ యంత్రం ఎప్పటికప్పుడు వేరు చేస్తుంది. జోరుగా వాన కురుస్తున్నా యంత్రం ద్వారా బొగ్గు ఉత్పత్తి చేయవచ్చు. బ్లాస్టింగ్, డ్రిల్లింగ్ వల్ల ధ్వని, వాయు కాలుష్యం ఏర్పడుతుంది. తక్కువ సమయంలో నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు యంత్రం దోహదపడుతుంది.

ఇక్కడే ఎందుకంటే..?కోయగూడెం ఓసీ, మణుగూరు పీకే ఓసీలో లేయర్ల వారీగా బొగ్గు ఉంటుంది. బొగ్గు, షేల్‌ను వేరు చేసేందుకు ఈ యంత్రాలు వినియోగిస్తున్నారు. మిషన్ కటింగ్‌కు బొగ్గు అనుకూలంగా ఉంటుంది. ఉత్పత్తి వ్యయం తక్కువవుతుండటంతో ఇక్కడ యంత్రాలు వాడుతున్నారు.

నాణ్యతతో కూడిన అధికోత్పత్తి

ప్రహ్లాద్, పీఓ, కేవోసీ

పర్యావరణ పరిరక్షణతో పాటు నాణ్యతతో కూడిన అధికోత్పత్తికి సర్ఫేస్‌మైనర్ యంత్రం దోహదపడుతుంది. కేఓసీ ఆవిర్భావం నుంచే ఇక్కడ యంత్రం ద్వారా బొగ్గు ఉత్పత్తి అవుతోంది.

# రైతులకు రెట్టింపు.. సీసీ ఛార్జీల వడ్డింపు

జనగామ : రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తును ఇస్తోంది. సరఫరా నిర్వహణలో భాగంగా వినియోగదారు రుసుము (కస్టమర్ ఛార్జీ) పేరిట రైతులు నెలకు రూ.30 చొప్పున ఏకమొత్తంగా ఏడాదికి రూ.360 చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి పెంపు ఆదేశాలు లేకున్నా నాలుగేళ్లుగా దీనికి రెట్టింపు వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఉత్తర్వులు లేవు.. వసూళ్లు ఉన్నాయ్

ఉచిత విద్యుత్తు పొందుతున్న రైతుల నుంచి ఏటా డిసెంబరు మొదటి వారం నుంచి చివరి వారంలోపు సీసీ రుసుము తీసుకుంటారు. వ్యవసాయ సర్వీసుల సంఖ్యకు అనుగుణంగా సీసీ రుసుము లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. దీంతో 2018 నుంచి క్రమం తప్పకుండా చెల్లించే రైతుల నుంచే రెట్టింపు వసూలు చేస్తున్నామని క్షేత్ర స్థాయి సిబ్బంది చెబుతున్నారు. ఇది కూడా ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా వసూలు చేస్తున్నారు.. నిర్దేశిత మొత్తానికి మించి వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని విద్యుత్తు శాఖ ఎస్‌ఈలు, డీఈలు అంటున్నారు. పెంపుదలకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు లేవని అంగీకరిస్తున్నారు.

ఉదాహరణలు ఇవిగో..

జనగామ జిల్లాలో అన్ని చోట్ల రైతుల నుంచి ఏడాదికి రూ.720 వసూలు చేస్తున్నారు. రఘునాథపల్లి మండలంలో ఓ గ్రామంలో గతేడాది రూ.360 చొప్పున వసూలు చేశారు. లింగాలఘన్‌పూర్ మండలం వనపర్తిలో ఓదఫా రూ.750 తీసుకున్నారు. తమ గ్రామాల్లో ఏటా రూ.750 వసూలు చేస్తున్నారని జఫర్‌గఢ్‌కు చెందిన వేములయ్య అనే రైతు, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం కొత్తపల్లికి చెందిన ముక్కెర మధు తెలిపారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలానికి చెందిన మాచర్ల ఏసురత్నం అనే రైతు తమ ప్రాంతంలో రూ.500 చెల్లిస్తున్నట్లు చెప్పారు.

ఒక రైతు పరంగా చూస్తే ఇది రూ.వందల్లోనే కనిపిస్తుంది. ఒక ఊరు, ఒక జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా లెక్కిస్తే రూ.కోట్ల మేర అదనపు భారం అవుతుంది. ఉమ్మడి జిల్లాలో 4.50 లక్షల వ్యవసాయ కనెక్షన్లున్నాయి. ఏటా సీసీ ఛార్జీల రూపేణా రూ.16.20 కోట్లు వసూలు కావాలి. రూ.720 చొప్పున వసూలు చేస్తే రైతులపై అదనంగా మరో రూ.16 కోట్ల భారం పడుతుంది.మూడేళ్లుగా చెల్లిస్తున్నా- గుండె గోపాల్‌రావు, లెంకాలపల్లి, నల్లబెల్లి మండలంమా కుటుంబంలో మూడు వ్యవసాయ కనెక్షన్లుండగా నిరుడు ఒక్కో దానికి రూ.600 చొప్పున రూ.1800 చెల్లించాను. ఈ ఏడాది అంతే మొత్తం చెల్లించాను విద్యుత్తు అధికారులు మూడేళ్లుగా ఇలాగే ఎక్కువ వసూలు చేస్తున్నారు. ఒక్కో మోటారుకు ఏడాదికి రూ.360లే కదా అని అడిగితే పెరిగాయని చెప్పారు. నిజమే కావొచ్చని వారడిగినంత చెల్లించి రశీదు తీసుకుంటున్నా.సరఫరా నిలిపివేస్తున్నారు..- ఐరెడ్డి జితేందర్‌రెడ్డి, బానోజీపేట, నర్సంపేట మండలం

ఉచిత కరెంటు ఇస్తున్నామని చెబుతున్న మాట సరికాదు. మాకు రెండు వ్యవసాయ మోటార్లున్నాయి. సర్వీసు ఛార్జీ కింద సంవత్సరానికి రూ.360 చెల్లిస్తే సరిపోతుందన్నారు. అధికారులు మాత్రం రూ.600 వసూలు చేస్తున్నారు. బిల్లుల వసూళ్ల కోసం పంటల సీజన్‌లో కరెంటు సరఫరాను నిలిపి వేస్తున్నారు. ఎన్‌పీడీసీఎల్ సీజీఎం(ఫైనాన్స్) తిరుపతిరెడ్డిని వివరణ కోరగా, ప్రభుత్వం నుంచి కొత్త ఆదేశాలు, నిబంధనలు లేవన్నారు. ఎస్‌ఈ వేణుమాధవ్‌తో గ్రూప్‌కాల్ ద్వారా మాట్లాడారు. రైతులు అదనంగా చెల్లిస్తే వారికే చెందుతుందని ఆయన వివరించారు. 'ఉన్నతాధికారుల వద్ద ఎక్కువ బిల్లు వసూళ్ల విషయాన్ని ప్రస్తావిస్తే.. బలవంతం చేయడం లేదని అడిగితే వారే స్వచ్ఛందంగా చెల్లిస్తున్నారని జిల్లా ఎస్‌ఈ మధుసూదన్ చెప్పారు.

# టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి.. సీఎం జగన్ నివాళి





అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొట్టతొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భాంగా ఆ మహనీయుడికి ఏపీ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో టంగుటూరి ప్రకాశం పంతులు కీలక పాత్ర పోషించారని తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన ఆ మహనీయుడని కొనియాడుతూ ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు.

# లోకేష్, యార్లగడ్డ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

కృష్ణాజిల్లా: గన్నవరం నియోజకవర్గంలో యార్లగడ్డ వెంకట్రావ్ ఆధ్వర్యంలో నారా లోకేష్ సమక్షంలో పెద్ద ఎత్తున వైసీపీ నేతలు, శ్రేణులు తెలుగుదేశం లో చేరారు. టీడీపీలో చేరిన వారిలో సిట్టింగ్ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, సర్పంచ్‌లు, సహకార బ్యాంకు సభ్యులు, ఇతర నియోజకవర్గం నేతలు ఉన్నారు. యార్లగడ్డ వెంట తెలుగుదేశంలో చేరేందుకు వైసీపీ నుంచి భారీ స్థాయిలో కీలక నేతలు, కార్యకర్తలు వచ్చారు. వంశీ వైసీపీకు వెళ్ళినప్పుడు ఆయన వెంట వెళ్లకుండా టీడీపీలో పసుపు శ్రేణులు ఉండిపోయారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ వంశీ ఓటమి కోసం అంతా కలిసికట్టుగా పనిచేస్తామని, కంచుకోటలో తెలుగుదేశం జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు. ఆత్మాభిమానంతోనే తెలుగుదేశంలోకి వస్తున్నాం తప్ప మరేదీ ఆశించి కాదన్నారు. వైసీపీలో గ్రామ స్థాయి నుంచీ రాష్ట్ర స్థాయి వరకూ ఏ ఒక్కరికీ గౌరవం లేదన్నారు. తాము




రౌడీయిజం చేయటానికి రాలేదని, రాజకీయం కోసమే వచ్చామన్నారు. కొత్త, పాత కలయికల్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. ఏ ఒకరికి సమస్య ఉన్నా నేరుగా తనకే చెప్పాలని సూచించారు. ఐక్యంగా గన్నవరంలో గెలిచి ముందు తెలుగుదేశం జెండా ఎగురవేద్దామని యార్లగడ్డ వెంకట్రావు పిలుపిచ్చారు.

# తప్పుడు గణాంకాలతో కేంద్రం నుంచి ఎక్కువ అప్పులు: యనమల

అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణా రాహిత్యంపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్‌కు తెదేపా సీనియర్ నేత, మాజీ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు లేఖ రాశారు. 2022 ఆడిట్ నివేదికలో కాగ్ లేవనెత్తిన అభ్యంతరాలను లేఖలో ప్రస్తావించారు. అసెంబ్లీ అనుమతి లేకుండా లక్ష కోట్లు అప్పు చేసినట్లు కాగ్ గణాంకాలతో సహా నిర్ధారించిందన్నారు. 2022 మార్చి నాటికే ప్రభుత్వ గ్యారెంటీల ద్వారా తీసుకున్న అప్పులు 1,18,003 కోట్లుగా కాగ్ తేల్చిందని లేఖలో పేర్కొన్నారు. కాగ్ నివేదికలో ప్రస్తావించిన అంశాల ఆధారంగా ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులపై సర్కారు వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్లులు, కార్పొరేషన్ రుణాలతో కలిపి ఏపీ అప్పు 10 లక్షల కోట్లకు చేరిన వైనాన్ని వివరించారు. ఇంత అప్పు చేసినా మూలధన వ్యయం దేశంలో సగటున 14 శాతం ఉంటే రాష్ట్రంలో 9 శాతం మాత్రమే ఉందన్నారు. ట్రెజరీతో సంబంధం లేకుండా కోట్ల



బిల్లుల చెల్లింపులు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు గణాంకాల ఆధారంగా కేంద్రం నుంచి ఎక్కువ అప్పులకు అనుమతి పొందిందని ఆరోపించారు. మితిమీరిన అప్పుల కారణంగా 2024 సంవత్సరంలో 42 వేల కోట్లు అప్పులుగా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందని యనమల రామకృష్ణుడు విమర్శించారు.

# అన్నీ పీక్కున్నారు... పుట్టగోసి మాత్రమే ఉంది... పోలీసులపై జేసీ ఆగ్రహం



అనంతపురం: పోలీసులపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ ఎమ్మెల్యేల కోసం ఎస్పీలు పనిచేస్తారా అంటూ మండిపడ్డారు. రూ.25 లక్షల ప్రజాధనం దుర్వినియోగం చేశారని అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవర్ని ఉద్ధరించడానికి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉన్నారన్నారు. “ఆస్తులు అన్నీ పోయాయి.. అన్నీ పీక్కున్నారు... పుట్టగోసి మాత్రమే ఉంది. 202 గన్ మెన్ లను తీసివేసి 1o1 పెడతారా... చంపుతారా చంపండి. నాలో ఫైటింగ్ స్పిరిట్ ఉంది... తాడిపత్రి కోసం ప్రాణం ఇస్తాను. ఏ కేసు అయినా ఎస్పీ కేసు... ఏదో ఒక రోజు అనుభవిస్తారు. పీడీ యాక్ట్ పెట్టు జైలుకు పోవడానికి సిద్ధంగా ఉన్నా. దరిద్రం నా కొడుకు మాటలు వింటారా... నా ఆస్తుల కోసం పోరాటం చేస్తున్నానా. ఎవడో ఫిర్యాదు చేస్తే కేసులు పెడుతున్నారు....76 కేసులు అయినాయి 77కేసులు అవుతాయి. ఎంతో కష్టపడి చదివి ఐఏఎస్. ఐపీస్‌లు అయ్యారు.. ఎందుకిలా అయ్యారు. సర్వే చేయడానికి 1600లు కట్టినా... సర్వే చేస్తే అయ్యేదానికి రూ.25 లక్షలు ప్రజల సొమ్ము ఖర్చు చేశారు. ప్రహరీగోడను కూల్చి వేస్తాం... వదిలిపెట్టేది లేదు. తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డిని సంతృప్తి పరచడంకోసం ఏమి చేస్తారో చేయండి. డీఎస్పీ గంగయ్య నీ బండారం బయట పెడతా... నీ సంగతి అంతా నాకు తెలుసు. మేం అంటే నీకు మొదటి నుంచి సరిపోదు... నీకు ఎక్కడి నుంచి ఎంత వస్తుందో అంతా బయట పెడతా. రిజిస్టర్ పోస్ట్ చేస్తే డీఎస్పీ రెఫ్యూజ్ చేస్తావా. గంగన్న మీకు భయపడేది లేదు. నేను లా ఒబిడియంట్... మట్కా డబ్బులు ఎమ్మెల్యేకు నీకు ఎవరెవరికి ఎంత పోతున్నాయో చెప్పా. సేవ్ ఆంధ్ర కోసం పని చేయండి.... మీకు చేతకాకపోతే సెలవు పెట్టి వెళ్లిపోండి. మూడు నాలుగు రోజుల్లో అందరిపైనా కేసులు పెడతా... ఎవరెవరు ఏమి చేస్తున్నారో వాళ్లందరిని విడిచిపెట్టేది లేదు. మీ లాంటి ఐఏఎస్, డీఎస్పీల వల్లే సీఐ ఆనందరావు ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సమస్యల వల్ల కాదు. మీ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో చనిపోతే ఆయన భార్యను రక్షించుకోలేక పోతున్నారు. ఇన్సూరెన్స్ వున్నా... వైద్యం కోసం బెగ్గింగ్ చేస్తారా. తాడిపత్రి ఎమ్మెల్యే మా తహసీల్దార్‌ను కొట్టాడు... చెప్పుకోలేని పరిస్థితి తహసీల్దార్ ది. ఎవరికీ భయపడేది లేదు... ఇసుకను బంద్ చేయండి లేకుంటే ఏమి అవుతోంది చూడండి. సబ్ రిజిస్టర్ ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు... ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు” ” అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి తనదైన శైలిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నాటి సోమయాన్.. వాజ్‌పేయీ సూచనతో ‘చంద్రయాన్’గా మారి..!

జాబిల్లి ఉపరితలంపై చంద్రయాన్-3 అడుగుపెట్టే మహోన్నత ఘట్టాన్ని వీక్షించేందుకు యావత్ భారతావని ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. చంద్రుడిపై పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన మూడో లూనార్ మిషన్ ఇది. అయితే జాబిల్లిపై ప్రయోగాలకు ఇస్రో మొదటగా అనుకున్న పేరు ‘చంద్రయాన్’ కాదట. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ సూచన మేరకు ఈ పేరును మార్చారట. ఈ మేరకు ఇస్రో మాజీ ఛైర్‌పర్సన్ డా. కె. కస్తూరిరంగన్ ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాటి సంగతులను బయటపెట్టారు. 1999లో ఇస్రో ఛైర్మన్‌గా ఉన్న కస్తూరిరంగన్.. భారత్ చేపట్టే తొలి లూనార్ మిషన్ ప్రయోగం అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించారు. ఆ సమయంలో ప్రధానిగా ఉన్న వాజ్‌పేయీ.. మిషన్ పేరు గురించి అడిగారు. ఈ ప్రయోగానికి తాము ‘సోమయాన్’ అని పేరు పెట్టాలనుకున్నట్లు ఇస్రో ప్రతినిధులు తెలిపారు. సంస్కృతంలో ఓ శ్లోకం ఆధారంగా ఈ పేరు పెట్టారట. ఈ శ్లోకానికి.. ‘ఓ చంద్రుడా.. మేం మా మేధస్సుతో నిన్ను చేరుకోవాలనుకుంటున్నాం. మాకు దారిచూపు” అని అర్థం. అందుకే ఆ పేరు పెట్టామని కస్తూరిరంగన్.. వాజ్‌పేయీతో చెప్పారు. దీనికి వాజ్‌పేయీ బదులిస్తూ.. లూనార్ మిషన్‌కు ‘చంద్రయాన్’ పేరైతే బాగుంటుందని సూచించారట. “ఇప్పుడు దేశం ఆర్థిక శక్తిగా అవతరిస్తోంది. భవిష్యత్తులో చంద్రుడిపైకి మరిన్ని యాత్రలు చేయగలిగే సత్తా మనకుంది” అని వాజ్‌పేయీ ఆనాడు చెప్పారని కస్తూరిరంగన్ నాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. కాగా.. 2003లో స్వతంత్ర




దినోత్సవం సందర్భంగా వాజ్‌పేయీ చారిత్రక ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి ప్రసంగిస్తూ ఈ ప్రయోగం గురించి అధికారికంగా ప్రకటించారు. “మన దేశం ఇప్పుడు శాస్త్ర, సాంకేతిక రంగంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి సిద్ధంగా ఉంది. 2008 నాటికి మన వ్యోమనౌకను చంద్రుడిపైకి పంపనున్నాం. ఆ మిషన్ పేరు చంద్రయాన్” అని నాడు వాజ్‌పేయీ ప్రకటన చేశారు. ఆయన అన్నట్లుగానే.. తొలి చంద్రయాన్ ప్రయోగం కోసం ప్రణాళికలు రచించేందుకు నాలుగేళ్లు పట్టగా.. ఆ తర్వాత మరో నాలుగేళ్లకు అంటే.. 2008లో అది జాబిల్లి వద్దకు దూసుకెళ్లింది. చంద్రయాన్-1 చంద్రుడి ఉపరితలంపై నీటి జాడలను గుర్తించడంతో ఆ ప్రయోగం విజయవంతమైంది. ఆ తర్వాత 2019లో ప్రయోగించిన చంద్రయాన్-2 చివరి నిమిషంలో విఫలమైంది. ఆ వైఫల్యాలను అధిగమిస్తూ ఇప్పుడు ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 విజయానికి చేరువలో ఉంది.




# ఘోరం.. నిర్మాణంలో ఉన్న వంతెన కూలి 17 మంది మృతి

ఐజ్వాల్: మిజోరంలో ఘోర ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన కూలిపోవడంతో దాదాపు 17 మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. రాజధాని నగరం ఐజ్వాల్‌కు 21కి.మీ దూరంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. నిర్మాణ పనులు జరుగుతోన్న సమయంలో ఈ వంతెన కూలింది. ప్రమాద సమయంలో అక్కడ 35 నుంచి 40 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం. వారిలో కొంతమంది శిథిలాల కింద చిక్కుకొని ఉంటారని తెలుస్తోంది. ఈ ఘటనపై మిజోరం ముఖ్యమంత్రి జొరామ్‌థంగా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ‘ఐజ్వాల్ సమీపంలోని సైరంగ్ వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయింది. సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను’ అంటూ సామాజిక మాధ్యమాల్లో ఘటన దృశ్యాలను షేర్ చేశారు.

# టీటీడీలో మత మార్పిడి జరుగుతోంది

విశాఖపట్నం: బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం బుధవారం విశాఖలో జరుగుతోంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిమాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలో మత మార్పిడి జరుగుతోందని, అక్కడ అడుగులు నాశనం అవుతుంటే టీటీడీ పట్టించుకోవడం లేదన్నారు. ఎర్రచందనం దారి మళ్ళిస్తున్నారని, అడవులను నాశనం చేయడం వల్లనే అక్కడున్న జంతువులు జనావాసాలకు వస్తున్నాయని, ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆందోళన కరంగా ప్రభుత్వం పనితీరుందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాలలో ఏడు లక్షల నలభై నాలుగు వేల కోట్ల రూపాయలు అప్పు చేసిందన్నారు. అప్పుల భారంతో రాష్ట్ర ప్రభుత్వం కృంగిపోతుందని.. ప్రభుత్వ ఆస్తులను సైతం తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కల్తీ మద్యం అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. సీఎం జగన్ ఇంటి దగ్గరలో మహిళలపై దాడులు జరుగుతున్నాయని, మహిళలకు రాష్ట్రంలో రక్షణ లేదని పురందేశ్వరి అన్నారు. గ్రామపంచాయతీల నిధులను దారి తప్పించారని.. చిన్న చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించవలసిన బకాయిలు ఇవ్వలేదని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేయాలని కేంద్రం ఎప్పుడు ఆలోచన చేయలేదని, ఉద్యోగులకు ఎలాంటి భరోసా ఇవ్వాలి.. వారి భవిష్యత్‌పై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ఉందన్నారు.




పార్టీకి పదాధికారులు అంకితభావంతో పనిచేయాలని, ఒకరికిద్దరికి బాధ కలిగి ఉండవచ్చునని, ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని పురందేశ్వరి అన్నారు. అగ్ర నాయకులు ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు ఇస్తారని, ప్రతి కార్యకర్తను కలుపుకుంటూ పోవాలని ఆమె హితవు పలికారు. పదవులు వచ్చిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. బీజేపీపై ప్రతి కార్యకర్తకు ఆత్మవిశ్వాసం పెరిగే విధంగా పదాధికారులు పనిచేయాలని, క్రమశిక్షణతో పనిచేయాలని, రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయాలని పురందేశ్వరి పిలుపిచ్చారు.

# ఆధార్ సీడింగ్ ద్వారా ఎవరివి దొంగ ఓట్లో తెలుసుకోవచ్చు




ప్రకాశం జిల్లా: టెక్నాలజీ చాలా తెలుసునని చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబు.. దాని ద్వారానే దొంగ ఓట్లు ఉంటే తెలుసుకోవచ్చుకదా అని.. ఆధార్ సీడింగ్ ద్వారా ఎవరివి దొంగ ఓట్లో తెలుసుకోవచ్చని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం మంత్రి ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ నగదు బదిలీలో వందలు, వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందనడం హాస్యాస్పదమన్నారు. బీఎల్వోలతో పాటు ఇంటింటి సర్వేకి అన్నీ పార్టీలు వెళ్తున్నాయని, దొంగ ఓట్లు ఉంటే తెలిసిపోతుందన్నారు. తెలంగాణా బీజేపీ నేత బండి సంజయ్ ఇక్కడ ఎవరికి మద్దతుగా మాట్లాడుతున్నారో ఆయనకే తెలియాలని మంత్రి ఆదిమూలపు అన్నారు. వైసీపీని మరోసారి అధికారంలోకి రాకుండా చేయలని అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ‘తరిమి తరిమి కొడతాం.. బట్టలూడ దీసి కొడతాం’ అంటూ మహిళలు ఉన్నారని కూడా చూడకుండా జుగుప్సాకరంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ‘ఎర్రడైరీ ఉంది.. పచ్చ డైరీ’ ఉందంటూ అధికారులను కూడా బెదిరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా టీడీపీ నేతల మాటలు ఉన్నాయని, పోలీసులపైనే దాడులకు తెగబడుతున్నారన్నారు. గతంలో ఎర్రగొండపాలెంలో టీడీపీ నేతలే హైప్ కోసం కావాలని చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి చేసుకున్నారని, ఎర్రగొండపాలెంలో రాళ్లదాడిలో వైసీపీ నేతల ప్రమేయం ఉందని రుజువు చేస్తే రాజకీయ సన్యాసం చేస్తానని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.

# ఆంబోతులా మాట్లాడుతున్న కొడాలి నానికి రోజులు దగ్గర పడ్డాయి.. జనసేన ఫైర్




కృష్ణాజిల్లా: వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నానిపై గుడివాడ జనసెన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంబోతులా మాట్లాడుతున్న కొడాలి నానికి రోజులు దగ్గర పడ్డాయని కృష్ణా జిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఓటర్లను ఆకర్షించేందుకు కొడాలి నాని ఇన్ని ట్రిక్కులు చేసిన ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారన్నారు. 2024 తర్వాత కొడాలి నాని పకోడీ, జంతికలు వేసుకొనే బతకాలి అంటూ ఎద్దేవా చేశారు. చిరంజీవి అభిమానుల దెబ్బకు కాళ్ల బేరానికి వచ్చారన్నారు. శాంతియుతంగా నిరసన చేసిన చిరంజీవి అభిమానులు 16 మందిపై కేసులు పెట్టించిన కొడాలి నాని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భూ కబ్జాలు, దోపిడీ తప్ప ప్రజలకు ఏం చేసావో చెప్పాలని డిమాండ్ చేశారు. అడ్డు అదుపు లేకుండా మొరిగితే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావని బండ్రెడ్డి రామకృష్ణ విరుచుకుపడ్డారు.

# అమరావతికి జగన్, పోలవరంకు మోదీ శనిలా పట్టారు



ఏలూరు: అమరావతికి సీఎం జగన్మోహన్ రెడ్డి, పోలవరంకు ప్రధాని నరేంద్ర మోదీ ఒక శనిలా పట్టారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి త్రాగునీరు, సాగునీరు, 900 మెగావాట్లు విద్యుత్తును అందించే ప్రాజెక్టు పోలవరం ప్రాజెక్టు అని అన్నారు. డ్యాం పోయింది, ప్రాజెక్ట్ గోడ కొట్టుకుపోయిందని రాష్ట్ర ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందని మండిపడ్డారు. పరిపాలన చేతగాని దద్దమ్మ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం వల్ల రాష్ట్రం అన్ని విధాలా నష్టపోతుందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి డబ్బులు తీసుకురాలేని వ్యక్తి జగన్ అని వ్యాఖ్యలు చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మించాలంటే మొదట నిర్వాసితులకు డబ్బులు చెల్లించాల్సిందే అని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# పెద్దిరెడ్డికి అనుకూలంగా పోలీసు వ్యవస్థ

చిత్తూరు: ప్రతిపక్ష పార్టీలపై అక్రమ కేసులు బనాయించడానికే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుకూలంగా పోలీసు వ్యవస్థ మారిందని బీసీవైపీ అధినేత రామచంద్ర యాదవ్ అన్నారు. బుధవారం నాడు పుంగనూరు ఘటనల్లో అక్రమ కేసుల్లో జైలుకెళ్లి చిత్తూరు సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న టీడీపీ నేతలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి మంత్రి పెద్దిరెడ్డికి తొత్తుగా మారారని మండిపడ్డారు. జిల్లాలో జరుగుతున్న ఇసుక, మైనింగ్, ఎర్రచందనం, భూ కబ్జా మాఫియాలను అరికట్టలేని పోలీసులు ప్రతిపక్షంపై మాత్రం అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. రాజకీయ నాయకులు శాశ్వతం కాదు అధికారులు మాత్రమే శాశ్వతం అని



చెప్పారు. తప్పు చేస్తున్న అధికారులు త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రామచంద్ర యాదవ్ హెచ్చరించారు.




# సుస్మితా సేన్ బ్యాక్ టూ యాక్షన్!

సీనియర్ నటి సుస్మితా సేన్ ఇటీవల అనారోగ్యానికి గురైన సంగతి తెలిసిందే. హృదయ సంబంధిత సమస్యలు ఎదుర్కోవడంతో కెమెరాకి దూరంగా ఉండాల్సి వచ్చింది. తాజాగా సుస్మిత అనారోగ్యం నుంచి కోలుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మళ్లీ కెమెరా ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. దీనిలో వెబ్ సిరీస్ 'ఆర్య-3' షూటింగ్ షురూ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ సిరీస్ షూటింగ్ జైపూర్ లో జరుగుతోంది. దీనిలో భాగంగా ఆదివారం ఆమె షూట్ కి హాజరయ్యారు. నేటి నుంచి యధావిధిగా షూటింగ్ లో పాల్గొంటున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసారు. 'ప్రస్తుతం నేను పూర్తిగా కోలుకున్నాను. సరిపోయినంత విశ్రాంతి తీసుకున్నాను. ఎక్కడైతో అస్వస్తతకి గురయ్యానో? అక్కడికి సంపూర్ణ ఆరోగ్యం వస్తున్నా. 'ఆర్య-3' మూడవ భాగం ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ఇక ఎంత మాత్రం సమయం వృద్ధా చేయను'



అని తెలిపారు. ఇంతకు ముందు సుస్మితసేన్ ప్రధాన పాత్రలో 'ఆర్య'..'ఆర్య2' వెబ్ సిరీస్ లు తెరకెక్కిన సంగతి తెలిసిందే. వాటికి కొనసాగింపుగా వస్తోన్న మూడవ భాగమిది. రామ్ మద్వానీ..సందీప్ మోదీలు సంయుక్తంగా తెరకెక్కిస్తోన్న వెబ్ సిరీస్ ఇది. రెండు భాగాలకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో మూడవ భాగం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఆ భాగాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అయితే రిలీజ్ తేదీని మాత్రం ఇంకా ప్రకటించలేదు. చిత్రీకరణ అనంతరం తేదీ ప్రకటించే అవకాశం ఉంది. అలాగే ఆ మధ్య సుస్మితా సేన్ వ్యాపార వేత్త లలిత్ మోదీతో ప్రేమలో ఉన్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. పెళ్లి కూడా చేసుకుంటు న్నట్లు ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఆ ప్రేమాయణం ఎంత వరకూ వచ్చిందన్నది ఎలాంటి అప్ డేట్ లేదు. ఈనేపథ్యంలో విడిపోయారని ప్రచారం సాగింది. అయితే ఈ ప్రచారం పై వాళ్లిద్దరు ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు. సుస్మితా సేన్ మాత్రం వృత్తిగత జీవితంపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తుంది.

# అమితాబ్ తో రొమాన్స్.. ఆ హీరోయిన్ కి వార్నింగ్ ఇచ్చిన ఖుష్బూ..!

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ ఖుష్బూ గురించి అందరికీ తెలిసిందే. ఉన్నది ఉన్నట్టుగా ముక్కుసూటిగా మాట్లాడే ఖుష్బూ హీరోయిన్ గా అప్పటి ప్రేక్షకులను అలరించగా ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. తమిళ్ సినిమాలే కాదు తెలుగులో కూడా ఆమె వరుస సినిమాలు చేస్తున్నారు. సినిమాలే కాదు జబర్దస్త్ షోలో పార్ట్ టైం జడ్జ్ గా ఉంటున్నారు. ప్రస్తుతం జబర్దస్త్ జడ్జిగా ఇంద్రజ కృష్ణ భగవాన్ ఉంటున్నారు. వీరిలో ఏ ఒక్కరు మిస్సైనా ఖుష్బూ అక్కడ ప్రత్యక్షమవుతుంది. లేటెస్ట్ గా గోపీచంద్ హీరోగా వస్తున్న రామబాణం సినిమాలో కీలక పాత్రలో నటించారు ఖుష్బూ. ఈ క్రమంలో లేటెస్ట్ గా ఓ స్పెషల్ చిట్ చాట్ లో పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూలో భాగంగా ఆమె హీరోయిన్ టబుకి వార్నింగ్ ఇచ్చిన విషయాన్ని చెప్పుకొచ్చారు ఖుష్బూ. అమితాబ్ అంటే



ఎంతో ఇష్టమని చెప్పిన ఖుష్బూ చినీకం సినిమాలో టబు అమితాబ్ తో కలిసి రొమాన్స్ చేయడం తట్టుకోలేకపోయానని అన్నారు. చిన్నప్పుడు అమితాబ్ తో కలిసి నటించాను పెద్దయ్యాక కుదరలేదు. అయితే తనకు రాని ఆ ఛాన్స్ టబు దక్కించుకున్నందుకు ఆమెకు ఫోన్ చేసి మరీ తిట్టిందట. అమితాబ్ తో రొమాన్స్ చేస్తే తాను చేయాలి నువ్వెందుకు చేశావ్.. ఆయనతో రొమాన్స్ చేసే హక్కు అర్హత తనకే ఉన్నాయని చెప్పిందట. అలా అమితాబ్ పై తనకు ఉన్న ఇష్టాన్ని వెల్లడించింది ఖుష్బూ. చిరంజీవి బాలకృష్ణతో కూడా కలిసి నటించే అవకాశం కూడా చూస్తున్న అంటూ చెప్పారు. ఆ అవకాశం ఎప్పుడు వస్తుందో చూడాలి అలాంటి ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నా అన్నారు ఖుష్బూ.. తెలుగులో ఎలాగు సినిమాలు చేస్తున్నా కాబట్టి త్వరలోనే అలాంటి ఛాన్స్ అందుకుంటానని నమ్మకం ఉందని అన్నారు. పవన్ కళ్యాణ్ తో అజ్ఞాతవాసి సినిమాలో నటించిన ఖుష్బూ ఆ సినిమా ఎందుకు ప్రేక్షకులకు నచ్చలేదో తనకు అర్థం కాలేదని అన్నారు. బహుశా పవన్ మదర్ గా తనని యాస్పెక్ట్ చేయలేదని అన్నారు. మా మధ్య మ్యూజిక్ మిస్ అయ్యి ఉండొచ్చని అన్నారు.

# బీచ్ లో అందాలు ఆరబోసిన ఆండ్రియా



కందా నాల్ ముదల్ అనే తమిళ చిత్రంతో సినిమా రంగంలో 2005 సంవత్సరంలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ఆండ్రియా జర్మియా. ఈ అమ్మడు తమిళంతో పాటు తెలుగు.. మలయాళం భాషల్లో కూడా నటించి మంచి గుర్తింపు దక్కించుకున్న విషయం తెల్సిందే. ఇండస్ట్రీలో అడుగు పెట్టి ఇన్నాళ్లు అయినా కూడా ఈ అమ్మడు ఏదో ఒక మార్గంలో వినోదాన్ని అందిస్తూనే ఉంది. తెలుగు సినిమాల్లో పెద్దగా కనిపించని ఈ అమ్మడు ప్రస్తుతం కూడా తమిళంలో రెండు మూడు సినిమాల్లో నటిస్తోంది. మరో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. ఇంత బిజీగా ఉన్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలతో రెగ్యులర్ గా సందడి చేస్తూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అయ్యాయి. పొట్టి షార్ట్ లో నడుము అందం చూపిస్తూ బీచ్ లో అందాలు ఆరబోసిన ఈ అమ్మడి యొక్క ఫోటోలు వైరల్ అవుతున్నాయి. షార్ట్ లో ఈ అమ్మడు థైస్ ను చూపిస్తూ చేసిన ఎక్స్ పోజింగ్ గతంలో పలు సందర్భాల్లో వైరల్ అయ్యాయి. ఇప్పుడు అదే తరహా లో ఈ ఫోటోలు కూడా చూపరులను అలరిస్తున్నాయి. తెలుగు లో తడాఖా సినిమాలో నటించిన ఈ అమ్మడు ఆ తర్వాత పలు డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించింది. తెలుగు లో ఈమె సునీల్ కు జోడీగా నటించడం వల్లే ఇతర హీరోల సినిమాల్లో ఆఫర్లు రాలేదు అనేది కొందరి అభిప్రాయం. తెలుగు లో ఆఫర్లు రాకున్నా కూడా ఈ అమ్మడు ఇలాంటి అందాల ఆరబోత ఫోటో షూట్స్ తో అన్ని భాషల ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది.

# స్టార్ హొటల్ లాంజ్ లో పిచ్చిలేపుతున్న క్యాట్ ఉమెన్?



2004లో విడుదలైన హాలీ బెర్రీ 'క్యాట్ ఉమెన్' హాలీవుడ్ లో ఒక సంచలనం. ఆ తర్వాత ఇదే తరహా పాత్రలతో పలు ఆంగ్ల చిత్రాలు విడుదలయ్యాయి. కానీ హాలీ బెర్రీ అద్భుత నటన ముందు ఎవరైనా దిగదుడుపే. అచ్చం పిల్లిలాగా ప్రవర్తించడం గోడలెక్కడం గెంతడం మ్యావ్ అంటూ విరుచుకుపడడం సహా ప్రతిదీ ఉత్కంఠను కలిగిస్తాయి. ఇలాంటి ప్రయోగాత్మక సినిమాల వెల్లువ మునుముందు భారతదేశంలోను సాధ్యమేనని అభిమానులు ఆశిస్తున్నారు. రొటీనిటీని జయించిన తెలుగు సినిమా పోకడ దీనికి భరోసాని కల్పిస్తోంది. .ఒకవేళ భారతదేశం నుంచి క్యాట్ ఉమెన్ గా నటించాల్సి వస్తే ఏ హీరోయిన్ సూటబుల్? అనేదానికి ఇదిగో ఇక్కడ సమాధానం లభించింది. 40 ఏళ్ల ప్రియాంక చోప్రా తాజా ఫోటోషూట్ వీక్షించాక వన్ అండ్ ఓన్లీ ఇండియాన్ క్యాట్ ఉమెన్ పీసీ అంటూ పొగిడేయకుండా ఉండలేం. వైట్ థై స్లిట్ గౌను నెక్ లైన్ తో పీసీ తాజా ఫోటోషూట్ వైరల్ అవుతోంది. ప్రియాంక అచ్చంగా క్యాట్ ఉమెన్ ని తలపిస్తోంది. పిల్లి చెవుల మాదిరిగా తన హెయిర్ ని డిజైన్ చేసిన తీరు ఎంతో ఆకట్టుకుంది. ప్రతిసారీ ఫోటోషూట్ల పరంగా ప్రయోగాలు చేసేందుకు వెనకాడని అమెరికా కోడలు ప్రియాంక ఈసారి కూడా దుమారం రేపిందని చెప్పాలి. ఇంతకీ పీసీ ఎక్కడ ఉంది? అంటే... ప్రియాంక చోప్రా జెండాయాతో రోమ్ (ఇటలీ) నగరంలో కనిపించింది. పాపులర్ BVLGARI హొటల్ ప్రారంభోత్సవానికి పలువురు సెలబ్రిటీలతో కలిసి హాజరైంది. ఇక్కడ తెల్లటి రంగు డిజైనర్ దుస్తుల్లో అద్భుతంగా కనిపించింది! హాలీవుడ్ స్టార్ జెండయా సహా ఇతర సభ్యులతో కలిసి పీసీ రెడ్ కార్పెట్ పై కనిపించింది. తనను చూడగానే క్యాట్ ఉమెన్ హాలీ బెర్రీ.. అలాగే 2020లో అరియానా గ్రాండే ను తలపించేలా రెండు పోనీటెయిల్స్ తో తన జుట్టును డిజైన్ చేయించింది. తెల్లటి బూట్లతో కంప్లీట్ రూపాన్ని ప్రదర్శించింది. ఆమె దుస్తులకు సంబంధించిన అనేక వీడియోలు ఫోటోలు అభిమానుల పేజీలలో అప్ లోడ్ అవుతున్నాయి. ప్రియాంక చోప్రా తెల్లటి స్లిట్ గౌనులో నెక్లైన్తో సెక్సీయెస్ట్ క్యాట్ వుమన్ లాగా ఉంది అంటూ ప్రశంసలు కురుస్తున్నాయి.

# సౌత్ ఇండస్ట్రీపై తాప్సీ వివాదాస్పద వ్యాఖ్యలు

2010 సంవత్సరంలో మంచు మనోజ్ హీరోగా నటించిన 'ఝుమ్మంది నాదం' చిత్రంతో హీరోయిన్ గా తాప్సీ పరిచయం అయింది. మొదటి సినిమానే రాఘవేంద్ర రావు వంటి దిగ్గజ దర్శకుడి దర్శకత్వంలో చేయడంతో తాప్సి కెరీర్ దూసుకు పోతుందని అప్పుడే అంతా భావించారు. అన్నట్లుగానే మొదటి సినిమా ఫ్లాప్ అయినా కూడా టాలీవుడ్ లో మంచి ఆఫర్లు వచ్చాయి. స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశం దక్కింది. కానీ నటిగా ఆమెకు కమర్షియల్ బ్రేక్ మాత్రం దక్కలేదు. భారీ విజయాలు ఆమె ఖాతాలో పడలేదు. దాంతో హిందీలో ఛష్మే బద్దూర్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. సౌత్ లో నటిస్తూనే హిందీలో కూడా ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. 2016 నుండి హిందీ సినిమాల్లో బిజీ అయ్యింది. హిందీ సినిమా పరిశ్రమలో అడుగు పెట్టి



పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా తాప్సీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాజాగా ఒక చిట్ చాట్ లో తాప్సి మాట్లాడుతూ.. బాలీవుడ్ లో మంచి కథలను ఎంపిక చేసుకోవడం వల్ల మంచి ఫలితాలు వచ్చి ఇన్నాళ్ల పాటు కొనసాగాను అంటూ చెప్పుకొచ్చింది. సౌత్ సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ గా నటించిన సమయంలో స్టార్ డమ్ దక్కింది కానీ నటిగా ఎప్పుడు కూడా సంతృప్తి దక్కలేదు అంటూ తాప్సీ కామెంట్స్ చేసింది. తాప్సి కామెంట్స్ ప్రస్తుతం వివాదాస్పదం అవుతున్నాయి. సౌత్ లో ఎన్నో పెద్ద సినిమాల్లో నటించడంతో పాటు కొన్ని మంచి పాత్రల్లో నటించి మంచి పేరు దక్కించుకుంది. అయినా కూడా నటిగా సౌత్ లో నటించడం వల్ల సంతృప్తి దక్కలేదు అనడం సౌత్ సినీ ఇండస్ట్రీని అవమానించినట్లే అంటూ సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. బాలీవుడ్ లో మంచి కథలు ఎంపిక చేసుకుని నటించడం వల్ల సంతృప్తి దక్కిందని.. సౌత్ లో స్టార్ డమ్ దక్కినా సంతృప్తి దక్కలేదని తాప్సి చేసిన వ్యాఖ్యలపై పలువురు పలు రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. సౌత్ లో కూడా మంచి కథలను ఎంపిక చేసుకుని నటించాల్సింది కదా అంటూ కొందరు ట్రోల్స్ చేస్తున్నారు. సౌత్ ఇండస్ట్రీ లో చేసిన సినిమాల వల్లే బాలీవుడ్ లో ఆఫర్స్ వచ్చాయి అనే విషయాన్ని గుర్తు పెట్టుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# గ్లామర్ డోస్ బాగా పెంచిన అర్జున్ రెడ్డి బ్యూటీ

అర్జున్ రెడ్డి చిత్రంతో హీరోయిన్ గా ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ షాలిని పాండే మొదటి సినిమా తోనే బ్లాక్ బస్టర్ సక్సెస్ ని దక్కించుకుంది. ఇలాంటి ప్రియురాలు కావాలని ప్రతి ఒక్క కుర్రాడు అనుకునే విధంగా ఆ సినిమాలో షాలిని పాండే నటించింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతగా ఆకట్టుకున్నా కూడా అదృష్టం సరిగా లేక పోవడంతో ముద్దుగుమ్మకు ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. అర్జున్ రెడ్డి పాత్రలో నటించిన విజయ్ దేవరకొండ టాలీవుడ్ స్టార్ అవ్వగా.. ఆయన ప్రియురాలి పాత్రలో నటించిన షాలిని పాండే మాత్రం సక్సెస్ లు లేకపోవడంతో



కొన్ని సినిమాలకే పరిమితం అయ్యింది. ప్రస్తుతం తెలుగు తో పాటు ఇతర భాషల్లో చిన్నా చితకా సినిమాలు చేస్తున్న షాలిని పాండే మరో వైపు భారీ ఎత్తున సోషల్ మీడియాలో అందాల ఆరబోత చేస్తూ అందరిని సర్ ప్రైజ్ చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన అందాల ఆరబోత ఫొటోలు షాకింగ్ గా ఉన్నాయి.

మిర్రర్ ముందు నిల్చుని క్లీ వేజ్ షో చేస్తూ అందాల విందు చేస్తూ ఫొటోలకు ఫోజ్ ఇచ్చింది. ఈ మధ్య కాలంలో షాలిని పాండే అందాల ఆరబోత కామన్ అయ్యింది. తాజాగా ఈ ఫొటోలను చూస్తూ ఉంటే ఈ మధ్య కాలంలో అర్జున్ రెడ్డి బ్యూటీ అందాల ఆరబోత మరింత ఎక్కువ అయ్యిందనే టాక్ వినిపిస్తుంది.

# పెద్ద రాష్ట్రాలను తలదన్ని అగ్రస్థానంలో నిలిచాం: సీఎం కేసీఆర్



మెదక్: అనతికాలంలోనే తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించిందని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మెదక్ కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సీఎం కేసీఆర్ మాట్లాడారు. “ తెలంగాణ రాకముందు పరిపాలన చేతకాదని విమర్శించారు. పరిపాలన సజావుగా సాగుతుందనేందుకు ఈ కార్యాలయాలే నిదర్శనం. దేశం, రాష్ట్రం, జిల్లా, పట్టణం ఏ స్థాయిలో ఉందని తెలుసుకునేందుకు డెవలప్‌మెంట్ ఇండెక్స్ ఉంటుంది. 70..75 ఏళ్లుగా రాష్ట్రాలుగా ఉన్న మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటకను కూడా అధిగమించి తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. విద్యుత్ వినియోగంలో కూడా భారత దేశంలో నెంబర్ వన్ స్థానంలో ఉంది. పరిశుభ్రమైన తాగునీరు అందించే ఏకైక రాష్ట్రం తెలంగాణ. అన్ని రంగాలకు నాణ్యమైన 24గంటల విద్యుత్ అందిస్తున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమే.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా దివ్యాంగుల పింఛను రూ.3వేల నుంచి రూ.4,016కు పెంచుకున్నాం. రాబోయే రోజుల్లో మరింత ఆర్థిక ప్రగతి సాధించి మరింత పెంచుకుంటాం. తెలంగాణ రాకముందు 24 లక్షల పింఛన్లు మాత్రమే.. తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు 50లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. తెలంగాణ ఆర్థిక ప్రగతి సాధించింది కాబట్టే సంక్షేమ పథకాలు అందిస్తున్నాం” అని సీఎం కేసీఆర్ వివరించారు.

# దివ్యాంగులకు పెంచిన పెన్షన్ల చెక్కులు అందజేసిన సీఎం కేసీఆర్



మెదక్ : జిల్లా పర్యటనలో భాగంగా సీఎం కేసీఆర్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. దివ్యాంగులకు పెంచిన రూ.4016 పింఛన్ సొమ్ము పంపిణీ, బీడీ టేకేదారులు, ప్యాకర్లకు రూ.2,016 చొప్పున ఆసరా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సీఎం కేసీఆర్ మెదక్ IDOC వేదికగా ప్రారంభించి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అంతకు ముందు మెదక్ జిల్లాలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయాన్ని (కలెక్టరేట్‌ను) ప్రారంభించారు. సీఎం కలెక్టరేట్ ప్రాంగణంలోకి చేరుకోగానే పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కార్యాలయం బయట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అలాగే జిల్లా పోలీస్ ఆఫీస్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సీఎం ప్రారంభించారు. కలెక్టరేట్‌ను, ఎస్పీ కార్యాలయాన్ని నిర్మించుకున్నందుకు మెదక్ జిల్లా ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. మెదక్ కలెక్టరేట్ ఆర్కిటెక్చర్ ఉషారెడ్డి మన తెలంగాణ బిడ్డేనని సీఎం కేసీఆర్ ఆమెను అభినందించారు.

# మహిళా రిజర్వేషన్లు నా వ్యక్తిగత ఎజెండా కాదు

## బిల్లు కోసం డిసెంబర్‌లో మళ్లీ దీక్ష చేస్తాం : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ : మహిళా రిజర్వేషన్లు తన వ్యక్తిగత ఎజెండా కాదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. దేశంలోని మహిళలందరూ చట్టసభల్లో రిజర్వేషన్లు కోరుకుంటున్నారని తెలిపారు. మహిళల రిజర్వేషన్ల కోసం అంబేద్కర్ కూడా కొట్లాడారని ఆమె గుర్తుచేశారు. ప్రస్తుతం పార్లమెంటులో మహిళలు కేవలం 12 శాతం మాత్రమే ఉన్నారని అన్నారు. తొలి లోక్‌సభలో 8 శాతం మహిళా ఎంపీలే ఉంటే.. ఇప్పుడు ఆ సంఖ్య 12 శాతానికి మాత్రమే చేరిందని అన్నారు. మణిపూర్‌లో ఇప్పుడు ఇద్దరు మహిళలు మాత్రమే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగానే మహిళలు మిగిలిపోవాలా? అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, బీజేపీ నాయకులు అనవసరంగా తనపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 2010 రాజ్యసభలో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు.. 2023 వచ్చినా ఎందుకు ఆమోదం పొందడం లేదని ప్రశ్నించారు. 14 ఏండ్లుగా మోదీ సర్కార్ మహిళా బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని నిలదీశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం వచ్చే డిసెంబర్‌లో మరోసారి దీక్ష చేస్తామని ఆమె ప్రకటించారు. ఈ దీక్షకు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, స్మృతి ఇరానీ సహా మహిళా నేతలు అందర్నీ ఆహ్వానిస్తామని తెలిపారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగినట్లు ఓ ప్రొఫెసర్ ఆరోపించారని గుర్తు చేసిన ఎమ్మెల్సీ కవిత.. దీన్ని ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏ పార్టీకి ఓటు వేసినా బీజేపీకే వెళ్తుందని ఓ ఎంపీ అనడం దారుణమని పేర్కొన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా చర్యలు తప్పవని బీఆర్ఎస్ నాయకులను ఆమె హెచ్చరించారు. ప్రజాజీవితంలో ఉన్న ఎవరైనా సరే మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ఎమ్మెల్యే టికెట్ రాని అందరికీ తగిన ప్రాధాన్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్‌కు భయమన్నది లేదని తెలిపారు. కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తుందని ఆమె ఆరోపించారు. గత ఎన్నికల్లో హామీలను ప్రజలు నమ్మలేదని అన్నారు.

# రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై కేసులా?.. తెలంగాణ ప్రజా ప్రతినిధుల కోర్టు జడ్జికి సుప్రీం షాక్



ఢిల్లీ: తెలంగాణ ప్రజా ప్రతినిధుల కోర్టు జడ్జి జయకుమార్‌ను సుప్రీంకోర్టు సస్పెండ్ చేసింది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికపై జడ్జి జయకుమార్ కీలక తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నికల అఫిడవిట్ వ్యవహారంలో.. శ్రీనివాస్‌గౌడ్ సహా 10 మందిపై ఎఫ్ఆర్ఐ చేయాలని జడ్జి జయకుమార్ ఇంతకు ముందు ఆదేశించారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులపై కేసు పెట్టాలని గతంలో ఆదేశించారు. అయితే.. రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై కేసులకు ఎలా ఆదేశిస్తారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

# కేసీఆర్ ఆదేశాలతో తుమ్మలకు బుజ్జగింపులు



హైదరాబాద్: అసంతృప్తులను చల్లార్చేందుకు బీఆర్ఎస్ అధిష్టానం రంగంలోకి దిగింది. ఖమ్మం సీనియర్ నేత, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం భేటీ అయ్యారు. గంటకు పైనే ఇద్దరూ చర్చించినట్లు సమాచారం. పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తుమ్మల టికెట్ ఆశించారు. అయితే ఆ టికెట్‌ను కందాల ఉపేందర్‌రెడ్డికి కేటాయించింది అధిష్టానం. దీంతో తుమ్మల అనుచరులు అసమ్మతి గళం లేవనెత్తారు. నిన్నంతా సమావేశమై పార్టీ నుంచి బయటకు రావాలంటూ తుమ్మలకు సూచించేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు తుమ్మల సైతం టికెట్ దక్కకపోవడంపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ వైపు ఆయన చూస్తున్నారని చెప్పుకుంటున్నారు. దీంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తుమ్మలతో చర్చించాలని నామా నాగేశ్వరరావును ఆదేశించారు. ఈ క్రమంలోనే ఇవాళ వాళ్ల భేటీ జరిగింది. మరోవైపు తుమ్మల తరహా నేతలు మరికొందరితోనూ చర్చించాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం. తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానం టీడీపీతో ప్రారంభమైంది. 1983 ఎన్నికల్లో ఓడారాయన. ఆపై సత్తుపల్లి నుంచి 1985, 1994, 1999 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నెగ్గారు. 2009లో ఖమ్మం నుంచి నెగ్గారు. 2014 విభజన తర్వాత జరిగిన ఎన్నికల్లో 6 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారాయన. ఎమ్మెల్సీగా మంత్రి బాధ్యతలు చేపట్టారు కూడా. అప్పటి నుంచి పాలేరు కేంద్రంగా రాజకీయం నడిపిస్తున్నారాయన.

2016లో పాలేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంరెడ్డి వెంకటరెడ్డి హఠాన్మరణంతో ఉప ఎన్నిక జరగ్గా.. తుమ్మల నాగేశ్వరరావు విజయం సాధించారు. అయితే.. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు అసెంబ్లీ స్థానం నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ దఫా కూడా ఆయన పాలేరు నుంచి టికెట్ ఆశించారు.

# గోదావరి నీళ్లు తెస్తేనే కేసీఆర్ కామారెడ్డిలో అడుగు పెట్టాలి: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: తొమ్మిదేళ్ల భారాస పాలనలో తెలంగాణ బొందలగడ్డ తెలంగాణగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్‌రెడ్డి.. చంద్రశేఖర్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. భారాస సర్కారుపై తీవ్ర విమర్శలు చేశారు. “దేశంలో తెలంగాణ నెంబర్ వన్ అంటున్నారు. అవును.. 60వేల బెల్టు షాపులు ఏ రాష్ట్రంలో లేవు. వైన్ షాపుల టెండర్ల పేరుతో రూ.2,600 కోట్లు కేసీఆర్ కొల్లగొట్టారు. కాంగ్రెస్ ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మిస్తే.. కేసీఆర్ రూ.7,500 కోట్లకు తెగనమ్ముకున్నారు. సాగునీటి ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్. కాంగ్రెస్ ఏం చేసిందో.. నాగార్జున సాగర్ కట్టమీద చర్చిద్దామా? చరిత్ర తిరగేసి చూస్తే కాంగ్రెస్ ఏం చేసిందదో తెలుస్తుంది. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు దిగమింగారు. కామారెడ్డిలో 22వ ప్యాకేజీ పనులు పూర్తి కాలేదు. కామారెడ్డికి గోదావరి నీళ్లు తెస్తేనే కేసీఆర్ కామారెడ్డిలో అడుగుపెట్టాలి. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో 25లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించాం. కేసీఆర్‌కు సూటిగా సవాల్ విసురుతున్నా. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోట మీరు ఓట్లు అడగొద్దు.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చిన చోట మేం ఓట్లు అడగం. నీళ్లు, నిధులు, నియామకాల నినాదాన్ని కేసీఆర్ తుంగలో తొక్కారు.

కమ్యూనిస్టులను కరివేపాకులా వాడుకుని వదిలేశారు. అందుకే ఏకపక్షంగా టికెట్లు కేటాయించుకున్నారు. భాజపా, భారాస, ఎంఐఎం ఒక్కటే. భారాసకు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ మాత్రమే. 26న చేవెళ్లలో జరిగే సభను విజయవంతం చేయాలి” అని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.




హైదరాబాద్ : మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం అభ్యర్థిగా ఇప్పటికే ప్రకటించిన మైనంపల్లి హన్మంతరావు స్థానంలో మరొకరికి అవకాశం ఇవ్వాలని భారాస అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయ అభ్యర్థి ఎవరనే విషయంలో అంచనాకు వచ్చిన తర్వాత నిర్ణయం ప్రకటించనున్నట్లు సమాచారం. మల్కాజిగిరి సీటు తనకు కేటాయించడంతోపాటు మెదక్ నుంచి తన కుమారుడికి టికెట్ ఇవ్వాలని, లేకుంటే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తామని హన్మంతరావు సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

దీంతోపాటు పార్టీలో, ప్రభుత్వంలో కీలకంగా ఉన్న మంత్రి హరీశ్‌రావుపైనా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం సీఎం కేసీఆర్ అభ్యర్థుల జాబితా ప్రకటించడానికి కొద్ది సమయానికి ముందు ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తీరా అభ్యర్థుల జాబితాలో మల్కాజిగిరి అభ్యర్థిగా ఆయన పేరు ఉండటంతో ఇదే విషయాన్ని విలేకరులు సీఎం వద్ద ప్రస్తావించారు. ‘టికెట్ కేటాయించాం. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలా? లేదా అనేది ఆయన ఇష్టం’ అని సీఎం వ్యాఖ్యానించారు. అనంతరం మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తదితరులు మైనంపల్లి వ్యాఖ్యలను ఖండించారు.

**స్పష్టత ఇచ్చినా పట్టుపట్టడంతో...** గత కొంతకాలంగా మెదక్ అసెంబ్లీ స్థానంలో మైనంపల్లి కుమారుడు రోహిత్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. రోహిత్‌కే మెదక్ టికెట్ ఇవ్వాలంటూ ఆయన అనుచరులు ఆందోళనలు కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మెదక్ నుంచి పద్మా దేవేందర్‌రెడ్డే మళ్లీ పోటీ చేస్తారని పార్టీ స్పష్టత ఇచ్చింది. స్పష్టత ఇచ్చిన తర్వాత కూడా మైనంపల్లి రెండు స్థానాల నుంచి పోటీ చేస్తామని పేర్కొనడం, హరీశ్‌రావుపై తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని సీరియస్‌గా పరిగణించిన పార్టీ అధిష్ఠానం మల్కాజిగిరి నుంచి కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మర్రి రాజశేఖర్‌రెడ్డితో పాటు మరో రెండు పేర్లు వినిపిస్తున్నా, అభ్యర్థిగా ఎవరిని నిర్ణయిస్తే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయో అంచనాకు వచ్చిన తర్వాత నిర్ణయం వెల్లడించనున్నట్టు తెలిసింది.

**కాంగ్రెస్ నేతల మంతనాలు :** మరోవైపు మైనంపల్లితో కాంగ్రెస్ నాయకులు మంతనాలు జరుపుతున్నట్టు తెలిసింది. కాంగ్రెస్‌లో ఇప్పటికే ఉన్నవారికి, సీనియర్ నాయకులకు కూడా కుటుంబంలో రెండు టిక్కెట్లు ఇవ్వడానికి కాంగ్రెస్ అధిష్ఠానం ఆసక్తి చూపడం లేదు. గత ఎన్నికల్లో అనివార్య పరిస్థితుల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులకు మాత్రమే అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో మైనంపల్లి పయనం ఎటువైపో అనేది చర్చనీయాంశంగా మారింది.

# నో డౌట్.. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



కొణిజర్ల(ఖమ్మం): రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పొంగులేటి మండలంలోని సిద్ధిక్ నగర్, పల్లిపాడు, పెద్దమునగాలలో పర్యటించారు. సిద్ధిక్ నగర్‌లో కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ, డప్పువాయిద్యాలు, కోలాటంతో స్వాగతం పలికారు. సిద్ధిక్‌నగర్‌లో అంబేద్కర్, మాజీ సర్పంచ్ బాగం రఘునాథరావు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణ మాఫీ, పింఛన్ రూ 4వేలు, నిరుద్యోగుల యువతకు రెండు లక్షల ఉద్యోగాలను మొదటి సంవత్సరంలోనే అమలు చేస్తామన్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోతు విజయాబాయి, రాష్ట్రమార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, ఎల్ఎండీ కన్వీనర్ సూరంపల్లి రామారావు, ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, ఎంపీపీ గోసు మధు, సర్పంచ్ జ్యోతి, సువార్త, ఎదునూరి శ్రీను, కృష్ణారావు, రాంపుడి రోశయ్య పాల్గొన్నారు. ఇంటికి వచ్చినప్పుడల్లా అమ్మ అప్యాయంగా పలకరించేదని, ఆ తల్లి మరణం మరువలేమని కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్‌కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దము నగాల సర్పంచ్ పరికపల్లి శ్రీను తల్లి వెంకటలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మరణవార్త తెలుసుకున్న పొంగులేటి మంగళవారం పెద్దమునగాలకు వెళ్లి శ్రీను పరామర్శించి అతని తల్లి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పొంగులేటి వర్గీయులు, కాంగ్రెస్ నియోజకవర్గ నాయ కురాలు బానోతు విజయాబాయి, బొర్రా రాజశేఖర్, కోసూరి శ్రీను, ఎంపీపీ గోసు మధు, రాంపుడి రోశయ్య, రాయల పుల్లయ్య, రాంబాబు, నరేంద్రనాయుడు, కోటి, కావూరి శ్రీను, మోషా, రావు, రామకోటయ్య, సోలా శ్రీను, ఎల్లయ్య, రంజిత్, కిషోర, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సచివాలయంలో నల్ల పోచమ్మ అమ్మవారి ప్రతిష్టాపన మహోత్సవం..

## హాజరైన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు



హైదరాబాద్ : తెలంగాణ సచివాలయంలో నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా జరిగే ఈ పూజా కార్యక్రమాలు బుధవారం ఉదయం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి.

పుణ్యాహవాచనం, యాగశాల శుద్ధి, గోపూజ, ఆవాహిత గణపతి హోమం నిర్వహించారు. కాగా, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మొదటి రోజు గణపతి పూజా కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. 24న ఉదయం 9 గంటలకు స్థాపిత పూజ, ప్రతిష్ఠాపన హోమం, మహాస్నపనం, వేద పారాయణం, మహాలక్ష్మీ యాగం, సాయంత్రం శయ్యాదివాసం, ఫల పుష్పదివాసం, మహా మంగళహారతి కార్యక్రమాలను చేపడుతారు. 25న ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు చండీయాగం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

# 27 నుంచి అమెరికాలో పర్యటించనున్న మంత్రి నిరంజన్‌రెడ్డి బృందం



హైదరాబాద్ : ఆధునిక సాంకేతికత, ఆహార రంగ పరిశ్రమలు, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బృందానికి అమెరికా పర్యటనకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మంత్రి నిరంజన్ రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 3 వరకు అమెరికాలో పర్యటించనుంది. మంత్రి బృందం 29 నుంచి 31 వరకు ఇల్లినాయిస్ రాష్ట్రంలో జరిగే ప్రతిష్టాత్మక ఫార్మ్ ప్రోగ్రెస్ షో కు హాజరవుతారు. అమెరికాలో ప్రముఖ వ్యవసాయిక రాష్ట్రం లోవా, నార్త్ కరోలినా, వాషింగ్టన్ డీసీలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. అనంతరం అమెరికా ఫెడరల్ వ్యవసాయ శాఖ కార్యదర్శి, అమెరికా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో భేటీ అవుతారు.

ఈ పర్యటన తెలంగాణ వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేయనున్నది. భవిష్యత్‌లో ఆహార పరిశ్రమలతో రైతులకు వ్యవసాయం మరింత లాభసాటి చేసే యోచనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఆ వైపుగా కార్యాచరణను ముమ్మరం చేసింది.

# దశల వారీగా చేతి వృత్తి దారులకు రూ.లక్ష ఆర్థిక సాయం : మంత్రి తలసాని

హైదరాబాద్ : కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ వారి అభివృద్ధికి చేయూతనిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం సనత్ నగర్, జూబ్లీహిల్స్, ముషీరాబాద్, అంబర్ పేట నియోజక వర్గాలకు చెందిన 1200 మంది BC కులవృత్తి దారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఒకొక్కరికి లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారీగా ఈ ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యం అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ఆలోచన అని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాతనే హైదరాబాద్ నగరంలో బస్తీ, కాలనీ అనే తేడా లేకుండా కోట్లాది రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, ప్రజల సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్నదని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలంటే తెలంగాణా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతుంటే, వాటిని చూడలేని BJP, కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 55 సంవత్సరాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఏం మేలు చేశారో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాగంటి గోపినాద్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బీసీ కార్పోరేషన్ అధికారి ఆశన్న, తదితరులు ఉన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com